ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



నాకు స్ఫూర్తినిచ్చిన పుస్తకం

ఏప్రిల్ 26, 2009

54 39293

మంత్రాలయ్

హ్యాపీబర్త్‌డే

(౨౦౦౯ ఏప్రిల్ ౨౬ నుంచి
౨౦౦౯ మే ౨ వరకు)

వి. సుజల
9సం॥, ఏప్రిల్-2000
సంధ్యారాణి-లక్ష్మణ్
సూర్యపేట

కె. అచ్యుత్
1సం॥, ఏప్రిల్-2008
జాహ్నవి-ధనంజయన్
సంతపేట-చిత్తూరు

సృజన
8సం॥,ఏప్రిల్-2001
శంకర్
వాలేర్-వరంగల్

ఎ.రాహుల్(టింకు)
7సం॥, ఏప్రిల్-26
విజయ-రాజు
మంచిర్యాల-ఆదిలాబాద్

ఎన్. తారక్‌రామ్
5సం॥, ఏప్రిల్-2004
లక్ష్మీవందన-శ్రీనివాస్
హైమవతీనగరం-శ్రీకాకుళం

గౌతమ్ తారక కృష్ణ
2సం॥, ఏప్రిల్-29
వసంత-యాదగిరి
పానగల్లు-నల్లగొండ

ఆర్. భార్గవ్
4సం॥, ఏప్రిల్-29
రాధ-దేముడుబాబు
మాధవధార-విశాఖ

రంజిత్(బన్ని)
5సం॥, ఏప్రిల్-29
రజిత-రాజలింగ
మంచిర్యాల-ఆదిలాబాద్

షేక్ అబ్దుల్ రజాక్
1సం॥, ఏప్రిల్-2008
మునీషా-సత్తార్‌వలి
పోదూరు-ప॥గో॥

కె. వినతిరెడ్డి
3సం॥, ఏప్రిల్-2006
సంధ్యారాణి-వెంకటరెడ్డి
టంగుటూరు-ప్రకాశం

సిహెచ్. శ్రీ రమణి
7సం॥, ఏప్రిల్-29
విజయ-అజయ్
కాకినాడ-తూ॥గో॥

జె. శ్రీలేఖ(పింకి)
10సం॥, ఏప్రిల్-1999
ప్రసన్న-శ్రీనివాస్
సదాశివపేట-మెదక్

ఎస్.వి. విద్యాధరణి
8సం॥, ఏప్రిల్-2001
లక్ష్మి-నారాయణ
ఇడుపూరు-ప్రకాశం

మనలో మాట



నిరీక్షణ

నిరీక్షణ ...వెయిటింగ్... ఇంతెజార్... పదం ఏదైనా పరేషానీ ఖాయం. కావడానికి నాలుగక్షరాల పదమే అయినా అమ్మో...మహా ముదురు. తెగ విసిగించిపారేస్తుంది. 'ఇంకా ఎంతసేపు?!' అని వెయ్యిసార్లు మన నోటి వెంట వచ్చేలా చేస్తుంది. ఒక చోట స్థిమితంగా కూర్చోనివ్వదు. నిలబడనివ్వదు. తిననివ్వదు. తాగనివ్వదు. పడుకోనివ్వదు. ఒక్కోసారి మాత్రం ఈ నిరీక్షణ చాలా మధురంగా వుంటుందట. కవులు చెప్తుంటారు. దాన్ని అట్టే నమ్మక్కర్లేదు. పంపిన కవితను ముద్రిస్తారో బుట్టలో వేస్తారో. కవులకు మాత్రం కంగారుండదూ!

రోగమొచ్చి ఆస్పత్రికి వెళ్తాం. నెంబరు తీసుకుని వరుసలో కూర్చుంటాం. మన టైం ఎప్పుడొస్తుందో. తీరా చూశాక డాక్టరేమంటాడో. చికిత్సకు ఎన్ని లక్షలవుతుందని చెప్తాడో. ఒకటే టెన్షన్.

పిల్లకాయలు పరీక్షలు రాశారు. ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. పెద్దలడిగినప్పుడు బానే రాశామని కొందరు పిడుగులు పైకి గొణిగినా లోపల బోలెడంత దిగులు. పిల్లలకు ఒకటే టెన్షన్. ఫలితాలొచ్చాక తల్లిదండ్రులకు మొదలవుతుంది అసలు టెన్షన్.

పక్కింటి సుబ్బారావు ఎదురింటి వెంకాయమ్మ ప్రేమలో పడ్డారు. గంట ముందే పార్కుకు చేరుకున్నాడు సుబ్బారావు. వెంకాయమ్మ ఎంతకీ రాదాయె! ఆమె కోసం నిరీక్షిస్తూ...స్తూ...ఊసుబోక గడ్డి పీకసాగాడు సుబ్బారావు. రెండు గంటలు గడిచిపోయాయి. సరిగ్గా అప్పుడు ఎవరో అతని వీపుమీద చిన్నగా చరిచినట్టనిపించి తిరిగి చూశాడు! సెక్యూరిటీ గార్డులు గుడ్లురుముతూ చేతిలో కాగితం పెట్టారు. వెంకాయమ్మ ప్రేమ సందేశమేమోనని ఆత్రంగా చూస్తే... అది జరిమానా రసీదు. పార్కులో గడ్డి పీకినందుకు!

మొన్నటిదాకా మొగల్తూరి మొనగాడు అసలు పార్టీ పెడతాడా? 'చిరు'వూరి రైలు అసలు వస్తుందా? అని ఒకటే ఎదురుచూపు. చూసీ చూసీ...కళ్లు కాయలు కాచి...చూపు మందగించిన ఒకానొక క్షణంలో ఎట్టకేలకు 'పార్టీ పెట్టానోచ్' అన్నాడాయన. అంతే! ఇరుగు పొరుగు పార్టీలలో సీట్లు దక్కవని ఖరారైనవారు, నిత్యం అసంతృప్తి జీవులు పెట్టే బేడా సర్దుకుని చిరు రైల్లో ఎక్కేశారు. బెర్తు ఖరారు చేసుకోవడానికి రుమాళ్లు, టవళ్లు, 'సూట్కేసులు' వేసి మరీ తెగ ఎదురు చూశారు. టీసీని పట్టుకోవాలిగానీ చేతిరుమాళ్లు, టవళ్లు సీట్లను ఆపుతాయా?

ఎట్టకేలకు ఎన్నికల ఘట్టం పూర్తయింది. నిన్నటిదాకా కాళ్లకు బలపాలు కట్టుకుని మరీ తిరిగిన నాయకులంతా కాపడాలు పెట్టుకుంటూ... ఫలితాలకోసం వెయిటింగ్. 'బేవార్సుగా పోగేసిన కోట్లు బయటకు తీశాం. ఖర్చు చేశాం. గెలుస్తామా? లేదా?' ఒకటే ఉత్కంఠ. ఒకరోజా రెండురోజులా! ఏకంగా ఓ నెల. ఏమి ఎన్నికల సంఘమో. మరీ ఇంత వెయిటింగా. తిండి సహించదు. నిద్ర పట్టదు. పీడకలలు. చస్ ఏం బతుకు?

ఓటేసిన సామాన్యుడు మాత్రం చిద్విలాసంగా చూస్తున్నాడు. టెన్షన్ లేదు. భవిష్యత్తేమిటో తనకు తెలుసన్న భరోసా కాబోలు...

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
స్ఫూర్తి	...	4
సీరియల్	...	6
కథ	...	8
అట్టమీది కథ	...	14
రుచి	...	17
చూద్దామా	...	18
క్రైమ్‌కథ	...	21
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

ఆరోగ్యం ...10

గ్యాస్ ట్రబుల్ తగ్గేదెలా



తెల్సా ...11

బుసకొట్టే పక్షి

బాల నేస్తాలు ... 12

బీర్బల్ కథలు

కూల్‌కూల్‌గా ... 22

మధురఫలం ద్రాక్ష



వాస్తవాలకు ప్రతిబింబం 'మనీ మాయ'

ఆదివారం అనుబంధంలో మనలో మాట 'మనీ మాయ' వాస్తవాలను ప్రతిబింబించింది. నాయకుల స్వార్థపరత్వాన్ని కళ్లకు కట్టింది. కడుపుబ్బ నవ్వించింది. 'నిజమే కవిని కాను', 'చలిరాత్రి' వంటి మంచి కవితలు అద్భుతం. 'గని' సీరియల్ బాగుంది. ఆసక్తికరంగా సాగుతోంది. పిల్లలకు బీర్బల్ కథలు బాగా చదివిస్తున్నాయి. కవర్ స్టోరీ సూపర్బ్. నాయకుల కుటుంబాలవారు మాత్రమే నాయకులవ్వాలా? కుటుంబ వారసత్వాలే రాజకీయాలా? ఇతరులకు అవకాశం ఇవ్వరా! కవర్ స్టోరీ ఆసాంతం చదివించింది. 'నవ్వుల్ పువ్వుల్' భలే నవ్వించింది. ప్రజాశక్తి ఆదివారం దాచుకోదగిన పుస్తకం. చక్కగా చదవదగ్గ పుస్తకం, వారపు విందు.

బుర్రి కుమార రాజు,
రత్నపురి కాలనీ, గుంటూరు.

మంచి మలుపు

ఏప్రిల్ 12 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో సరిదే నాగేశ్వరరావు కథ 'సంధ్యా సౌందర్యం' చదివాను. చాలా బావుంది. రాలిపోయే పువ్వుల గురించి కరుణ చూపే హృదయాలు వున్నాయా? కొత్తది ఏదైనా బావుంటుంది. స్నేహం మాత్రం పాతది బావుంటుంది. రాజారావు అనంత్‌ల స్నేహం గొప్పది. ఆ గొప్ప స్నేహమే కథలోని మంచి పరిణామం. వసంత రుతువు వస్తే ఎండిన కొమ్మకూడా చిగురించినట్టు రాజారావు పాత్ర స్నేహానికే విలువనిచ్చింది. సామాజిక లోపాలు ఎన్ని వున్నా మనిషికి సాంఘిక చైతన్యమే సమస్యకు పరిష్కారం. జీవిత సంధ్యా సమయంలో అనంత్, సీత ఒక్కటవడం మంచి మలుపు. రాలిపోయిన పువ్వుల పట్ల కరుణ చూపిన మంచి స్నేహితుడు దొరకడం అనంత్ అదృష్టం. జీవితం ప్రవహించే నది. వేగం వుంటేనే నది సాగుతుంది. చైతన్యం వుంటేనే సమస్య పరిష్కారం అవుతుంది. అనంత్, సీత ఒక్కటైనాక ఎంతో సంతోషంగా వుంది. మంచి కథ చదివాను అన్న తృప్తి కలిగింది.

పరుచూరు వెంకటేశ్వరరావు,
మంగళగిరి.

వింత గ్రామం అద్భుతం

ఈ సంచికలో ప్రచురించిన వింతగ్రామం చాలా బావుంది. నిజంగా ఇలాంటి గ్రామంలో వుంటే బావుంటుంది కదా అనేట్టుగా వుంది. నేటి పట్టణాల్లోని కాలుష్యాల నుండి దూరంగా ప్రశాంతంగా ఇలాంటి ప్రదేశాల్లో జీవించడం అద్భుతంగా వుంటుంది. విజ్ఞాన వీచికలోని మరోతరం మొబైల్ చదివిన తర్వాత సెల్‌ఫోన్ల గురించి మరింత వివరంగా తెసుకున్నాము. నిజంగా ఈ కొత్త మొబైల్ ఫోన్లు అరచేతిలో ఇమిడిపోయే చిన్న సైజు కంప్యూటర్లే అనిపించింది.

వెంకట్, తిరువూరు.

పలు విషయాలు తెలిపిన కవర్

ఈ వారం అట్టమీది కథగా వచ్చిన 'సకుటుంబ భారతం' నేటి రాజకీయ వారసుల గురించి తెలుసుకునేట్టుగా వుంది. కుటుంబ వారసులు అధికారంలోకి రావడానికి ఎంత దారుణానికైనా తెగిస్తారు. చివరికి తర, తమ భేదాలు మరిచి ఎన్ని రాజకీయ కుట్రలైనా చేస్తారు. మన దేశంలోని ఎన్ని కుటుంబాల్లో ఎందరెందరు వారసులుగా వచ్చారో లెక్కలేదు. ఇన్ని వివరాలు అందించిన వి.రాజగోపాల్ గారికి అభినందనలు.

సౌమ్య, రాజారావు నగర్.

'మాయ' నచ్చింది

మనలో మాట గా వచ్చిన మనీ మాయ బాగా నచ్చింది. నేటి ఎలక్షన్లలో మనీ ఎంతగా రాజ్యమేలుతోందో చూస్తూనే ఉన్నాం. అది అధికార పక్షమైనా లేక ప్రతిపక్షమైనా నేడు ఏవో కొన్ని పార్టీలు తప్పితే మిగతా పార్టీలన్నీ పోటీపడి మరీ డబ్బును వెదజల్లుతున్నాయి. ఎలక్షన్లప్పుడు మినహా ఎప్పుడూ కనిపించని ఓటరు ఇప్పుడు మాత్రం దేవుడైపోతాడు. ఇది నిజంగానే మనీ మాయే. కూల్ కూల్‌గా శీర్షికలో ఈ వారం కర్బూజా గురించిన వివరాలు చాలా తెలుసుకున్నాం. మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఈ కర్బూజా పండ్ల గురించి తెలుసు. మరికొన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే ఈ పండ్ల గురించి ప్రాచుర్యం లభిస్తోంది. ఇంత మంచి ఫలాన్ని గురించి ఎన్నో వివరాలు తెలిపినందుకు సంతోషంగా వుంది.

బి. సుబ్బారావు, సంగుపాలెం,
కోదూరు.

ప్రతివారం జోక్స్ కావాలి

ఈ వారం స్నేహ సంచికలో 'నవ్వుల్ – పువ్వుల్' బావున్నాయి. ప్రతివారం ఇలా జోక్స్ ఇవ్వొచ్చుకదా. బాల నేస్తాలులో వస్తున్న బీర్బల్ కథలు బావుంటున్నాయి. ఇలాంటి కథలు ఎప్పుడూ వేయాలని మా కోరిక. చలిరాత్రి కవిత బాగుంది. విజ్ఞాన వీచికలో కొత్త కొత్త విషయాలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు. ఈ వారం కథ 'సంధ్యా సౌందర్యం' కూడా మమ్మల్ని ఆకట్టుకుంది. కామెడీ కథలు కూడా అందిస్తే బావుంటుంది. కొత్తగా ప్రారంభించిన స్ఫూర్తి శీర్షిక సూపర్.

ఎమ్. రాంబాబు, తూ.గో.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

మినీ ...

- కలవలపల్లి బాలసుబ్రహ్మణ్యం



తీగలు తెగుతున్న వైనం
అమ్మాయి అత్తవారింటికి పయనం

సమున్నత స్థానం!
ఎన్ని సహకార హస్తాలో!

రుచికరమైన వంట తయారైంది
ఎంత ఆనందం ఒలికిపోయిందో!

కమ్మని గానం సాగుతోంది
గుండె గుడిలో ఎన్ని జోరీగలో!

ఓ ఇల్లు నిలబడింది
ఎన్ని ఆత్మీయతా స్తంభాలో!

ఓ సుదీర్ఘ కవిత
కొండ కింది కలుగులో చిట్టెలుక!

పదాల పెదాలలోని సుధారసం గ్రోలాను నేను
ఆనంద డోలలూగుతోంది నా మేను

కవిత్వమ్

సంఘర్షణ

- తంగిరాల చక్రవర్తి



రాజకీయ రాబందుల
రెక్కల చప్పుళ్ళ హోరు
ఎన్నిక(ల)ల భారతిలో
శ్రామికుల శ్రమ నిత్యహారతి
పేదోళ్ల బతుకు బీళ్లు వారుతున్నాయ్
మా'నవ' జీవన చిత్రాలు ఛిద్రమయ్యేవేళ
మనసుకు – మనిషికి తావేది?
కొత్త పొద్దుల పొత్తుకు రూపేది?
గాయపడ్డ గుండె గాయాల్ని మాన్పే
లాలిత్యపు లేపనాల కోసం.... లాప్‌ట్యాపులో
వెతికే యువ అంతరంగాల 'సత్య(o)'శోధన
సామాన్యులకర్థం కాని ఓ మాయా తంత్రమే!
ఎండమావుల మైదానాన్ని దాటుకుంటూ...
జీవధారల వంటి పంట పొలాల బాట
బ్రతుకు ప్రయాణం ఆరంభిద్దాం!
'అమ్మ' లాలింపుకు సరితూగే ప్రకృతి
మాత ఒడిలో వేల వేల భావాల్ని సంఘర్షిద్దాం...
"సెజ్" సంకెళ్ల బందీయైన పుడమితల్లి...
విముక్తి పోరుకై – శృతి గీతం పాడుదాం నువ్వు... నేను...
మనమౌదాం... నూరు పూలు పూయిద్దాం.. వేల ఆలోచనల్ని
వికసింప చేద్దాం... సంఘర్షణ లోంచే
సమతా – మమతల శ్రామిక రాజ్యం నిర్మిద్దాం...
సమతా.... మమతల శ్రామిక రాజ్యం నిర్మిద్దాం...

★



ఎ.జి యతిరాజులు
బహుభాషా రచయిత,
అనువాదకులు, విద్యావేత్త.

నేటికీ మార్గదర్శిని

ఇరవై కథలలోనూ నాగదత్త, ప్రభా, సురయాలను తనకు అత్యంత ప్రీతి పాత్రమైన కథలనీ, ఉత్తమ కథలనీ రాహుల్ సాంకృత్యాయన్ ఒకానొక సందర్భంలో పేర్కొన్నారు. అయితే నాకు మాత్రం అన్ని కథలూ అత్యుత్తమ కథలుగానే కనబడుతున్నాయి. మానవ జాతి చరిత్రలో మొదట మాతృస్వామ్యము తదనంతరం వ్యక్తిగత ఆస్తి ఏర్పడిన తర్వాతే పితృస్వామ్యానికి పరివర్తన చెందటానికి ఈ కథలలో మనం గమనించవచ్చు. ఇండో-యూరప్ ప్రాంతంలో ఏ ప్రదేశంలోనైనా సరే తొలుత బానిస యుగము భూస్వామ్య యుగము (రాజరిక వ్యవస్థ) పెట్టుబడిదారీ యుగము-సామ్రాజ్యవాద యుగము సామ్యవాద యుగము క్రమానుగతంగా ఈ కథనికలలో అరటి పండు వలిచి తినిపించినట్లు పాఠకులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకుంటారు.



మార్క్సిస్టు మహామేధావి, ప్రపంచ మహాయాత్రికుడు సుమారు 150 పుస్తకాల రచయిత రాహుల్ సాంకృత్యాయన్ మహత్తర రచన "ఓల్గా నుంచి గంగకు" తమిళ అనువాదం నేను సుమారు 55 సంవత్సరాల మునుపు మొట్ట మొదటసారి చదవటం తటస్థించింది. మానవ జీవన పరిణామాన్ని, చరిత్రను కథానికల రూపంలో హిందీలో రచించిన ఈ గ్రంథం భారతీయ ఆధునిక సాహిత్యంలో అపూర్వమైనదనే చెప్పాలి.

ప్రథమ పఠనంలో నా యువ హృదయాన్ని అమితాశ్చర్య పరచిన ఈ పుస్తకం ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలకన్నా ఎంతో మిక్కుటమైన జ్ఞానాన్ని ప్రసాదించింది. ప్రపంచాన్ని అవగాహన చేసుకోవటానికి గతితార్కిక తర్కంతోను చారిత్రక భౌతికవాద పరిజ్ఞానంతోను ఈ పుస్తకం ఉందనే విషయం తర్వాతి కాలంలోనే నాకు తెలిసి వచ్చింది.

కొన్ని సంవత్సరాల తర్వాత తెలుగు అభ్యుదయ సాహిత్యం నాకు పరిచయమైనపుడు మహాకవి శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయ, కొడవటిగంటి కుటుంబరావు మొదలగు వారి రచనలు, చదువుతున్న సందర్భంలో మరలా ఈ "ఓల్గా నుంచి గంగకు" తెలుగు అనువాదం చదివే అవకాశం వచ్చింది. అప్పటి తెలుగు అనువాదాన్ని అల్లూరి సత్యనారాయణరాజు చేశారు. ఆయన ఒక మాజీ కమ్యూనిస్టు. కాంగ్రెస్ రాష్ట్ర మంత్రిగా కూడా ఉన్నారు. తెలుగు అనువాదం కూడా సజీవంగా రాహుల్ రచనలోని మరెన్నో కోణాలను దర్శింపజేసింది.

వాస్తవానికి రాహుల్‌జీ రాసిన హిందీ పుస్తకంలో "మానవ సమాజం" అనేది ఒకటి. 1. దీనిని హిందీలోనే నేను కొన్ని సంవత్సరాల తర్వాత హిందీ ఉపాధ్యాయుడినయ్యాక చదవగలిగాను. దీనినే పలు సంవత్సరాల అనంతరం తమిళంలో అనువదించే అవకాశం కూడా లభించింది. ఈ గ్రంథంలోని సారాన్ని రాహుల్‌జీ తన 'ఓల్గా నుంచి గంగకు' లో ఆకర్షణీయమైన కథానికలుగా మలచారు.

భారతీయ పాఠకులకు సులభంగా అర్థం కావాలనే ఉద్దేశ్యంతో ఆయన ఈ కథలకు నేపథ్యంగా విశాల ప్రపంచాన్ని తీసుకోకుండా ఇండో యూరప్ ప్రాంతాన్ని మాత్రమే తీసుకున్నారు. ఈ ప్రాంతంలోని వివిధ దేశాల చరిత్రలను, మత గ్రంథాలను, సాంస్కృతిక వారసత్వాలను క్షుణ్ణంగా పరిశోధించి, పరిశీలించి విభిన్న కథానికలుగా మలిచారు రచయిత.

యూరప్, మధ్య ఆసియా, భారతదేశాలను తన దృష్టిలో ఉంచుకొని ఆ ప్రాంతాలలో క్రీస్తు పూర్వము ఆరువేల సంవత్సరాల నుంచి క్రీస్తు శకము 1942 వరకు జరిగిన సంఘటనలను, మార్పులను, యుద్ధాలను, సాహిత్య సృజనను రాహుల్‌జీ తన శైలిలో వివరించారు. ఈకథలను చదివేటపుడూ ఆయన అత్యద్భుతమైన మేధస్సు మనలను ఆ కాలాలలోకి తీసుకెళుతూ ఉంటుంది.

ఐరోపాకు చెందిన రష్యాలోని, ఓల్గా నదీ తీరంలో క్రీ.పూ 6000 సంవత్సరాల నాడు "నిషా" అనే ప్రథమ కథానికలో, అక్కడే క్రీ.పూ 3500 సంవత్సరాల నాడు ఉన్న పరిస్థితులను "దివా" అనే కథలోనూ మన కళ్ళకు కట్టిస్తారు. ఆనాడు మానవులు మృగప్రాయలుగా వేటాడుతూ ఇతర తెగల వారిని చంపుతూ ప్రకృతిని ఎదిరించి తమ సంతానాన్ని కాపాడుకుంటూ తల్లి అధికారంలోనే మొత్తం తెగ ప్రవర్తిస్తున్న చారిత్రక సత్యాన్ని ఈ కథలో వివరిస్తారు ఆనాడు వస్త్రధారణ లేకుండా వావివరుసలు లేకుండా వ్యవహరించిన మానవ సంఘాల గురించి చదువుతున్నపుడు 'వారి వారసులమే మనం' అనే జ్ఞానం మనకు కలుగుతుంది.

మూడవ కథ- అమృతాస్వ (క్రీ.పూ. 3000 సం॥) మధ్య ఆసియా 4. కథానిక పేరు - పురుహూత్ (క్రీ.పూ. 2500)- తజకిస్థాన్, రష్యా 5. పురుధాన్ (క్రీ.పూ. 2000 సం॥)- ఆఫ్ఘనిస్తాన్, 6. అంగిరా (క్రీ.పూ.1800 సం॥) - ఆఫ్ఘనిస్తాన్ తక్షశిల 7. సుదాస్ (క్రీ.పూ. 1500 సం॥)- ఉత్తర ప్రదేశ్ 8. ప్రవాహణ్ (కీ.పూ. 700 సం॥) పంజాబ్ 9. బంధుల్ మల్ల (క్రీ.పూ 490 సం॥)- కపిల వస్తు నేపాల్ 10. నాగదత్త (క్రీ.పూ. 335 సం॥)- తక్షశిల గాంధార 11.ప్రభా (క్రీ.పూ. 50 సం॥) - సాకేత్ (అయోధ్య) 12. సుపర్ణ యౌధేయ (క్రీ.శ. 420 సం॥) -ఉజ్జయిని (మధ్య భారతము) 13. ధుర్ముఖ (క్రీ.శ. 630 సం॥) - కనోజ్ నగరము 14. చక్రపాణి (క్రీ.శ. 1200 సం॥) - కనోజ్ నగరము 15. బాబా నూరుద్దీన్ (క్రీ.శ. 1300 సం॥) ఢిల్లీ నగరము 17 రేఖా భగత్ (క్రీ.శ. 1800 సం॥) - పాట్నా, భీహార్ 18. మంగళ్ సింఘ్ (క్రీ. శ. 1857 సం॥)- ఉత్తర ప్రదేశ్ 19. సఫదర్ (క్రీ.శ. 1922 సం॥) లక్నో నగరము 20. సుమేర్ (క్రీ.శ. 1942 సం॥) పాట్నా

పై ఇరవై కథలలోనూ నాగదత్త, ప్రభా, సురయాలను తనకు అత్యంత ప్రీతి పాత్రమైన కథలనీ, ఉత్తమ కథలనీ రాహుల్ సాంకృత్యాయన్ ఒకానొక సందర్భంలో పేర్కొన్నారు. అయితే నాకు మాత్రం అన్ని కథలూ అత్యుత్తమ కథలుగానే కనబడుతున్నాయి.

మానవ జాతి చరిత్రలో మొదట మాతృస్వామ్యము తదనంతరం వ్యక్తిగత ఆస్తి ఏర్పడిన తర్వాతే పితృస్వామ్యానికి పరివర్తన చెందటానికి ఈ కథలలో మనం గమనించవచ్చు. ఇండో-యూరప్ ప్రాంతంలో ఏ ప్రదేశంలోనైనా సరే తొలుత బానిస యుగము భూస్వామ్య యుగము (రాజరిక వ్యవస్థ) పెట్టుబడిదారీ యుగము-సామ్రాజ్యవాద యుగము సామ్యవాద యుగము క్రమానుగతంగా ఈ కథానికలలో అరటి పండు వలిచి తినిపించినట్లు పాఠకులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకుంటారు.

చివరి కథ 'సుమేర్'లో 1040 ప్రాంతంలో ప్రపంచ ఆర్థిక సంక్షోభం పర్యవసానంగా జర్మనీలోనూ, ఇటలీలోను తలెత్తిన ఫాసిజంపై యుద్ధంతో ముగుస్తుంది. చివరి కథల్లో భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాట చరిత్రలో గాంధీజీ పాత్ర మన సమాజంలోని అభిశాపం అస్పృశ్యత గురించి, అపుడే భారత గడ్డపై అవతరిస్తున్న కార్మిక వర్గం గురించి కూడా రాహుల్‌జీ ప్రస్తావించడం మరువలేదు.

ఈ ప్రసిద్ధ కథానిక సంగ్రహం "ఓల్గా నుంచి గంగ"కు చదవడం పూర్తి చేసిన తర్వాత మనకేదో ధ్యాన బోధ కలిగిన అనుభూతి తోస్తుంది. గత మానవజాతి సుదీర్ఘ ప్రయాణం పట్ల దాని పరిణామంగానే నేటి మన పరిస్థితుల పట్ల, దాని పరిణామంగానే నేటి మన పరిస్థితుల పట్ల ఒక స్పష్టమైన మార్క్సిస్టు ధృక్పథం తీసుకోవల్సిన అవసరాన్ని ఈ పుస్తకము మనకు కలిగిస్తుంది.

ఇంతటి ఉత్తమ గ్రంథానికి కూడా విమర్శల శరాఘాతాలు ఆ కాలంలోనే తప్పలేదు. చరిత్ర గతిని అడ్డుకోలేదు. వెనక్కు మళ్లించాలనే సనాతనవాదులు "ఓల్గా నంచి గంగ" కు 1944లో వెలువడగానే దీనికి వ్యతిరేకంగా గందరగోళం సృష్టించారు. భావ స్వాతంత్ర్యానికి వ్యతిరేకులైన ఈ పెద్ద మనుషులు ఈ పుస్తకము సామాజిక శాంతిని భంగపరుస్తుందని మత విశ్వాసాల పట్ల నిరసన సృష్టిస్తుందని కనుక వెంటనే నిషేధించాలని కూడా బ్రిటిష్ ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చారు. అయినా భారతీయ సాహిత్య వినీలాకాశంలో ఈ గ్రంథం 60 సంవత్సరాల తర్వాత కూడా సంచలనం కలిగిస్తూనే ఉండటం, రాహుల్‌జీ అనగానే "ఓల్గా నుంచి గంగ"కు అనే పేరు గుర్తుకు రావటం దాని విశిష్టతకు అద్దం పడుతున్నాయి.

ఈ పుస్తకాన్ని తమిళంలోనూ తెలుగులోనూ చదివిన పది సంవత్సరాలకు హిందీ భాషాశైలి నన్ను మరింత ఆకట్టుకుంది. గత 55 సంవత్సరాల కాలంలో ఈ పుస్తకంలా మరే పుస్తకం కూడా నాకు స్ఫూర్తినివ్వలేదు. ఈ నాటికి అది నాకు మార్గదర్శనం చేస్తోంది. మీలో ఇంతవరకు దాన్ని చదవని వారు వుంటే ఇకనైనా చదువుతారు గదూ!

★

ఈ ప్రసిద్ధ కథానిక సంగ్రహం "ఓల్గా నుంచి గంగ"కు చదవడం పూర్తి చేసిన తర్వాత మనకేదో ధ్యాన బోధ కలిగిన అనుభూతి తోస్తుంది. గత మానవజాతి సుదీర్ఘ ప్రయాణం పట్ల దాని పరిణామంగానే నేటి మన పరిస్థితుల పట్ల, దాని పరిణామంగానే నేటి మన పరిస్థితుల పట్ల ఒక స్పష్టమైన మార్క్సిస్టు ధృక్పథం తీసుకోవల్సిన అవసరాన్ని ఈ పుస్తకము మనకు కలిగిస్తుంది.

ఈ పుస్తకాన్ని తమిళంలోనూ తెలుగులోనూ చదివిన పది సంవత్సరాలకు హిందీ భాషాశైలి నన్ను మరింత ఆకట్టుకుంది. గత 55 సంవత్సరాల కాలంలో ఈ పుస్తకంలా మరే పుస్తకం కూడా నాకు స్ఫూర్తినివ్వలేదు. ఈ నాటికి అది నాకు మార్గదర్శనం చేస్తోంది. మీలో ఇంతవరకు దాన్ని చదవని వారు వుంటే ఇకనైనా చదువుతారు గదూ!

సీరియల్

జరిగినకథ:

చంచల్ కుమార్‌కు బొగ్గుగనిలో పనిచేసేటప్పుడు గాయం అవుతుంది. బాగా రక్తం పోతుంది. అయినా పని చేయక తప్పదు. ఒక్క చంచల్ కుమారే కాదు! అక్కడ ప్రతి ఒక్కరి పరిస్థితీ అదే. ఎంత పని చేసినా ఒక్క మెచ్చుకోలు మాట వుండదు. పైగా తిట్లు, ఛీత్కారాలు. కొరడా దెబ్బలు. ఆ పని భారం...చిత్రహింసలూ పడలేక మరోచోటికి వెళ్లిపోవడానికీ లేదు. ఒకవేళ అలా ఎవరైనా ప్రయత్నిస్తే...గని లోపలే కొట్టి చంపేసి మట్టి పూడుకుపోవడంతో చనిపోయారని ప్రకటిస్తారు. ఆ తర్వాత...

గని

తమిళ మూలం : **కె. చిన్నప్పభారతి**

అనువాదం : **వి. వెంకటేశ్వర**

(నాల్గవ భాగం)

అతనికి ఎన్నెన్ని అనుభవాలో! గనిలో ప్రవేశించినప్పటి నుంచి బయటికి వచ్చేదాకా ప్రాణాలకు భరోసా లేదు. తమకు కూడా ఇతర మానవులకు వలె సహజత్వం, చైతన్యమూ ఉన్నాయని తెలియన్వికూడదు. గని అంటే నరకకూపమే! గని లోపల గాలి ఒత్తిడి అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వేడి ఆవిరి ఊపిరాడనివ్వడం లేదు. నాలుక ఎండిపోతోంది. ఒళ్లంతా చెమటలు కారుతున్నాయి. తల తిరుగుతున్నట్టు అనిపిస్తోంది. ఆకలికి కడుపు నకనకలాడుతోంది. ఖాళీ కడుపులోకి గాలి ప్రవేశించి నీటి బుడగలా ఇటూ అటూ తిరుగుతోంది. పేగులు ఉంగలు చుట్టుకొని, ఓపలేని బాధ. భోజన విరామానికి సంకేతంగా వినిపించే సైరన్ కూత ఇంకా వినిపించలేదు. ముందుగా భోంచేస్తే కూలికి తిలోదకాలు వొదులుకోవాల్సిందే. కొద్దిగా వంగి పక్కనే ఉన్న చెలమలోంచి నీళ్లు జుర్రుకుని తాగాడు. కడుపు నిండింది. మరలా పనిలోకి దిగాడు. గంజి తాగి పరిగెత్తుతున్న కుక్కపిల్ల కడుపులాగా కడుపు లోపల నీరు తాళమేస్తోంది! కడుపేమో నిండింది. నాలుకా తడిసింది. కానీ క్షుద్బాధ మాత్రం తగ్గలేదు. కాళ్లలో వణుకు మొదలైంది. చేతులు సహకరించడం లేదు. కానీ బానిసత్వం తాలూకు భయం అతణ్ణి పని చేయమని పురిగొల్పుతోంది. మనసులో ఆకలికీ, పనికీ మధ్య సంఘర్షణ. జీవితం తాలూకు భయం రెండింటికీ రాజీ కుదర్చాలని ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ తనకు తెలియకుండానే అతడు స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కార్మికులంతా గుమిగూడి, అతడ్ని లేవదీసి గంజి అందించారు.

రాబందులా తిరుగుతోన్న మైనింగు గుమస్తా దీన్ని గమనించాడు. స్పృహ తప్పి పడిపోయిన వాడికి తోటి కార్మికులు సహాయం చేయడాన్ని తన అధికారానికి విసిరిన సవాల్‌గా అతడు భావించాడు. ఎటువంటి పరిస్థితులలోనయినా సరే తన అనుమతి తీసుకోకుండా కార్మికులు ఏ పనీ చేయకూడదు. అలా చేయడం తను విధించిన నిబంధనలు ఉల్లంఘించడం కాదా? గనులలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరిగేవే? అంతమాత్రాన, కార్మికులు పని చేయడం నిలిపేసి సహాయ కార్యక్రమాలలో మునిగిపోతే ఉత్పత్తి దెబ్బ తినదా? ఈ కార్మికులు తమ వంతు పూర్తిచేసి, పడిపోయిన వాడు చేయాల్సిన పనికూడా పూర్తిచేసి పెట్టడమే కదా ఉద్యోగ ధర్మం! మైనింగు గుమాస్తా గట్టిగా అదిలిస్తూ వచ్చాడు. 'కుక్కల్లారా! వాడు చస్తే గని మూతబడిపోతుందా ఏం? ఉత్పత్తి తగ్గితే నష్టం వస్తుంది. యజమాని కుంగిపోతాడు. మీరూ నష్టపోతారు. పదండి పదండి' అటూ జంతువుల్ని కొడుతున్నంత సహజంగా వాళ్లకు కొరడా అంటించాడు. వాళ్లను కొట్టాడేగానీ, కింద పడివున్న వాడి వంక చూడనైనా చూడలేదు. ఇలాంటి విషయాల్ని పెద్దగా పట్టించుకోకూడదన్నది అతడు నిర్వహణా పాఠాల్లో నేర్చుకొన్నాడు. గాయపడిన వాణ్ణి పరామర్శించడం మనిషికి సహజ గుణం కదా! కానీ, ఒక సంస్థలో కింది స్థాయి ఉద్యోగాన్ని పర్యవేక్షించే వాళ్లకు అలాంటి గుణం ఉండకూడదు. అలాంటి గుణం ఉంటే, గాయపడిన వాడి పట్ల జాలి కలుగుతుంది. సాయం చేయమని ఇతర కార్మికులకు చెప్పడం పని జాప్యం కావడం జరుగుతాయి. పనిలో జాప్యాన్ని యాజమాన్యం ఒప్పుకొంటుందా?

గతంలో ఓ కార్మికుడి కాలికి పెద్ద గాయమైనప్పుడు ఇదే మైనింగు గుమస్తా అతడ్ని బయటికి తీసుకెళ్లి చికిత్స చేయించమని ఇతర కార్మికులను పురమాయించాడు. అతడు కొత్తగా ఉద్యోగంలో చేరాడు. నిర్వహణకు సంబంధించిన వ్యవహారజ్ఞానం అప్పటికీ తెలియదు. యాజమాన్యం అతడికి ఓ నెలజీతం ఇవ్వకపోవడంతో పాటు అక్షింతలు వేసింది. దాంతో అతడు రాటుదేలిపోయాడు. అతడి గుండెలో సహజంగా జాలువారే మానవతా భావధార కాస్తా ఆవిరైపోయింది. కార్మికుల పట్ల అతడికున్న సానుభూతి ఓ మహా ప్రవాహంగా మారి ఉండేదేమో! జఠరాగ్ని గురించిన ఆలోచనా ప్రాధాన్యతా క్రమంలో ప్రథమస్థానం వహించడంతో అది కాస్తా గడ్డకట్టుకుపోయింది.

తన బాధ కన్నా, తనకు సాయం చేయడానికి వచ్చి, కొరడా దెబ్బలు తిన్న సహకార్మికుల బాధ చంచల్‌కుమార్ శరీరమంతటా నిప్పులా జ్వలిస్తోంది.

జీవితం దుస్సహనంగా ఉంది. మనకు జరుగుతోన్న అన్యాయాన్ని భరిస్తూ, మూగవాళ్ళలా పడి ఉండకూడదు. మాపట్ల కనీసం కొంత కనికరమైనా చూపకూడదా అని అడగడంలో తప్పేముంది. అతడి మనసులో ఆలోచనా కీల రగులుతోంది. 'ఎప్పుడూ రాని ఆలోచన'లు కదా ఇవి! ఒక నమ్మకస్తుడైన కార్మికుడికి కలలోనయినా రాకూడని ఆలోచనలు కదా! పేదరికంతోనూ ఆకలితోనూ ఊరూరా అలమటిస్తున్నప్పుడు దయ తలచి ఉపాధి కల్పించాడు

కదా! వాళ్లకు వ్యతిరేకంగా గొంతు విప్పడం ఎంతటి పాపకార్యం! మనకు దేవుడు ప్రసాదించిన భిక్ష జీవితం! మనం ఇలా కష్టపడాలని విధాత రాసిపెట్టి ఉన్నాడు. ఇక ఇతరులను నిందించడం దేనికి? పరంపరానుగతంగా వస్తోన్న ఆత్మన్యూనతాభావం ఆవహించగా 'పస్తు పడుకోనవసరం లేకుండా ముద్ద దొరుకుతోంది. అదే పదివేలు' అనుకొన్నాడు.

గంతులేస్తోన్న మేకపిల్ల కాలిగిట్ట అతడి తలమీది గాయానికి తగిలింది. 'అయ్యో!' అని అరిచాడు. మరుక్షణం కోపంతో 'పాపిష్టి మేకపిల్ల' అని నిందిస్తూ, దాన్ని కొట్టడానికి చేయి చాచాడు. అయితే చీకట్లో అతడి గురి తప్పింది. తగ్గిందనుకొన్న నొప్పి మళ్లీ మొదలైంది. చేత్తో గాయాన్ని రుద్దుకుంటూ ఇంట్లోకి నడిచాడు. కాపడం పెట్టుకోవడం కోసం.

3

ఆ రోజు ఉదయం యథాప్రకారం సైరన్ కూత వినిపించింది. బోనుల్లోంచి సర్కస్ గోదా (వృత్తం) లోకి వెళుతోన్న జంతువుల్లా గనిలోకి వెళుతున్నారు కార్మికులు. చంచల్‌కుమార్, బికాస్ చౌదరి తమ సహచరులతో బాటు గనిలోకి వెళ్లారు.

పని మొదలైంది. బొగ్గును తవ్విపోయడం కోసం ముందు డైనమైట్లు పేల్చారు. అందులో ఒకటి పేలలేదు. అయితే ఆ విషయం వాళ్లు గమనించలేదు. దిబ్బల్లోంచి బొగ్గును తొట్టెల్లో నింపడం మొదలెట్టారు. డైనమైటు మీద పార తగలడంతో అది కాస్తా పేలింది.

ఒక పెద్ద బొగ్గుదిబ్బ ముక్కలు ముక్కలుగా విరిగి పడింది. ముగ్గురు కార్మికులు ఆ శకలాల మధ్య చిక్కుబడిపోయారు. బొగ్గును తొట్టెలోకి చేరవేయడం కోసం కాస్త పక్కకు జరిగిన బికాస్ తృటిలో తప్పించుకొన్నాడు. అయితే తన కళ్ల ముందు జరిగిన ఈ దుర్ఘటనను చూసి అతడు క్షణ కాలం కొయ్యబారిపోయాడు. అంతలోనే తనకు తెలియకుండానే 'చిక్కుబడిపోయారు, చిక్కుబడిపోయారు' అని గట్టిగా అరిచాడు. గని లోపల అనేక గుహల్లో పనిచేస్తోన్న కార్మికులంతా దీన్ని తలా ఓ రకంగా అర్థం చేసుకొన్నారు. 'పైకప్పు కూలిపోయింది' అన్నారు కొందరు. మరికొందరు 'నీటి ఊట' అన్నారు. ఇలా వాళ్లు అనేక విధాలుగా చెప్పుకొంటూ తప్పించుకోవడానికి పరుగెత్తారు. హాహాకారాలతో గని దద్దరిల్లింది. కాసేపటి తర్వాత అసలు సంగతి అర్థమైంది. దుర్ఘటనాస్థలానికి అందరూ వచ్చి చేరారు. అక్కడ పనిచేస్తున్న కార్మికుల గురించి విచారించారు. ఒక్కొక్కరు ఒక్కో పేరు చెబుతున్నారు. పేరుకుపోయిన బొగ్గు అడుగునుంచి సన్నగా ఓ మూలుగు వినిపించింది. పార, గడ్డపార తీసుకొని మెల్లగా బొగ్గును తొలగించసాగారు. కొద్దిసేపటికి పాదం కనిపించింది. తాకి చూశారు. వెచ్చగానే ఉంది. 'ప్రాణం ఉన్నట్టుంది' అనుకొంటూ బొగ్గంతా గబగబా తొలగించసాగారు. చేతులు రెండూ బార చాపుకుని బోర్లా పడి ఉన్నాడొకడు. ఓ చెయ్యి విరిగిపోయింది. బొగ్గు ముక్కల మీద నెత్తురు గడ్డకట్టింది. బోర్లా పడడంవల్ల ముక్కుపుటాలు మూసుకుపోలేదు. కాబట్టి ప్రాణాలు దక్కాయి. అయినప్పటికీ ఒంటిమీద స్పృహ లేదు. విరిగిన చేయి వాడిపోయిన తోటకూర కాడలా ఉంది. అతడి మొహంపై నీళ్లు చల్లారు. స్పృహ వచ్చింది. ఆ తర్వాత బొగ్గుముక్కల్ని పూర్తిగా తొలగించారు.

జంటగా ఒకరి పక్కన మరొకరు వెల్లకిలా పడుకొన్న భంగిమల్లో ఇద్దరు కార్మికులు. నోరు, ముక్కు, కళ్లు, చెవులు ఇలా అన్ని ద్వారాల్లోంచి బొగ్గు శరీరంలోకి ప్రవేశించడం వల్ల ఊపిరాడక మరణించినట్టుంది. తొట్టెల్లో పెట్టి, ఇవతలకు తీసుకొచ్చారు. వైద్యుడు, పరీక్షించి, మరణించినట్టు నిర్ధారణ చేశాడు. ప్రాణాలతో బయటపడిన కార్మికుల్ని చికిత్స కోసం తరలించారు.

యాజమాన్యం వద్ద కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఇంకా రెక్కలు మొలవని పావురాలు గద్దకు అందుబాటులో కూచున్నంత దీనంగా ఉంది. తమకు ఉపయోగపడని ప్రతి విషయం మీదా విరక్తి పుడుతోంది. తమను తామే పరాయీకరణ చేసుకొంటున్నారు వాళ్లు. ఎందుకు స్వతంత్రంగా ఆలోచించలేకపోతున్నారు!

చనిపోయిన వాళ్ల అంత్యక్రియల కోసం యాజమాన్యం వారు కొంత మొత్తాన్ని అందజేశారు. మృతుల కుటుంబాలకు మరే సహాయమూ అందదని చెప్పకనే చెప్పినట్టుంది యాజమాన్యం వారి ప్రవర్తన.

మృతులు ఇద్దరూ యువకులే. ఒకనికి ఏడాది నిండిన చిన్న పిల్లాడు. భార్య నిండు చూలాలు. మరొకరికి కాస్త ఎక్కువ ఎడం ఉన్న ముగ్గురు పిల్లలు. వాళ్ల పరిస్థితి తలచుకొని అందరూ బాధ పడ్డారు. ఆ పసివాళ్లకిప్పుడు బతుకు తెరువేది? గనిలో వారానికోమారు కూలి డబ్బులు చెల్లిస్తారు. అది చేతిలోకి రాకముందే ఆదాయానికి మించి అప్పు చేస్తారు కార్మికులు. అయినా కూలి డబ్బులు అందుతాయన్న భరోసా ఉండడంతో ఇంటికి కావలసిన వస్తువులు తెచ్చుకోవడంలో ఇబ్బంది లేదు. ఎలాగోలా బతుకుబండి కదులుతుండేది. కానీ ఇప్పుడేం చెయ్యాలి? ఆ రెండు కుటుంబాలూ చుక్కాని లేని నావలయ్యాయి. కనీస భద్రత సైతం కొరవడి తల్లడిల్లక తప్పదా? ప్రతి జీవన నౌకకూ ఇదే గతి పడుతుందా? అందరూ ఎందుకు మౌనం వహిస్తున్నారు? తమకు ఇలాంటి కష్టం రాదని భావిస్తున్నారా? ఒకవేళ అలా జరిగితే..

ఆస్తి పాస్తుల్లేని బీదసాదలు తమ శ్రమశక్తి మీదే ఆధారపడి జీవనయానం సాగిస్తారు. ఆ శ్రమసంపదే నశించిపోతే? ఆ కుటుంబాలకు జీవనాధారం మటుమాయమైంది. వాళ్ల భవిష్యత్తు ప్రశ్నార్థకమైపోయిందన్న చింత అందర్నీ కలవర పెడుతోంది.

పెంపుడు కుక్కల్ని ఇంట్లోంచి తరిమేసినా, అవి మళ్లీ వచ్చి యజమాని కాళ్లను చుట్టుకొంటాయి. తమ జీవితాలపై తమకు ఎలాంటి హక్కు లేని కార్మికుల జీవితాలు ఇంతకంటే భిన్నం కావు. తన స్వేచ్ఛను కోల్పోయే ప్రమాదం ఉన్న కార్మికుడు పోరాటాల ద్వారా మాత్రమే దాన్ని కాపాడుకోగలుగుతాడు.

ఆక్రోశం, ఆవేశం, విద్రోహం ముప్పిరిగొనగా అతని మనసులో ఎన్నో భావాలు!

ఆ రెండు కుటుంబాలన్నీ గాలికి వదిలేసినట్టే, ఇంకా పర్మనెంటు కాని కార్మికులవడం వల్ల యాజమాన్యాన్ని గట్టిగా అడిగే వీల్లేకపోయింది. తక్కువ కూలికి పని చేయడానికి ఎంతో మంది ముందుకు వస్తుండడంతో తగినంత నష్టపరిహారం చెల్లించి తన దాతృత్వం ప్రకటించుకోడానికి యాజమాన్యం వారు సిద్ధపడలేదు.

యాజమాన్యం వద్ద కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఇంకా రెక్కలు మొలవని పావురాలు గద్దకు అందుబాటులో కూచున్నంత దీనంగా ఉంది. తమకు ఉపయోగపడని ప్రతి విషయం మీదా విరక్తి పుడుతోంది. తమను తామే పరాయీకరణ చేసుకొంటున్నారు వాళ్లు. ఎందుకు స్వతంత్రంగా ఆలోచించలేకపోతున్నారు! గాలి మనల్ని మృదువుగా స్పృశిస్తుంది కదా! నీళ్లు దాహాన్ని తీరుస్తున్నాయి కదా! నక్షత్రాలు మనకేసి చిరునవ్వులు చిందిస్తున్నాయి కదా! కార్మికులు మాత్రం హాయిగా నవ్వకూడదా? ఆలోచించకూడదా? బాధల్ని చెప్పుకోకూడదా? జనాభాలో అత్యధికశాతం మందికి ఎందుకు ఇవన్నీ అందడంలేదు? వాళ్లకు ఆకలి గురించి మాత్రమే తెలియడం వల్లనా? అందులోంచి పుట్టిన పిరికితనం (అనే బానిసత్వపు వినయాతిరేకం) వల్లనా?

నిరంతరం బాధకూ, ఆవేదనకూ అలవాటు పడిన మనస్సులలో విప్లవభావాలు నాటుకోవడం కష్టం. ప్రస్తుత పరిస్థితి కంటే దారుణమైన పరిస్థితులు ఏమొస్తాయి? అన్న భావం వాళ్లలో పేరుకొని ఉంది. అయినప్పటికీ ఎద్దుల్లా పనిచేయించుకొంటున్న యాజమాన్యం పట్ల కొంత అయిష్టత లేకపోలేదు.

కార్మికులంతా కలిసి ఓ నిర్ణయం తీసుకొన్నారు.

(ఇంకావుంది)

కథ

- ఉష

నీటిలో చేపలు



"అబ్బ...ఒకవైపు పచ్చని చెట్లు..మరో వైపు గలగలల కృష్ణానది..ఎదురుగా చిత్రకారుడు గీసినట్టు కొండలు..మరోవైపు రయ్యిమని వెళ్లేందుకు చక్కని బైపాసు రోడ్డు...లక్షలు పోసినా ఈ వాతావరణం రాదోయ్..."

మామిత్రుల సంభాషణంతా అక్కడి వాతావరణంలోని పల్లెటూరి పచ్చదనాన్ని పొగుడుతూ సాగుతోంది.

"ఏయ్..మీరిక్కడికి రావడం ఇది మొదటిసారి కాదని మర్చిపోయారా..?" ప్రశ్నించాన్నేను.

"భేషుగ్గా గుర్తుంది తల్లీ..ఆ తుప్పలు...రాళ్లు ..కీచురాయి అరుపులు... మేమెలా మర్చిపోతామే..కానీ అప్పుడు ఇక్కడిక్కాదేమో వచ్చింది...?!" అందరూ సందేహం వ్యక్తం చేశారు.

"అక్షరాలా మీరు ఇదివరకు చూసిందీ ఇదే.. ఇప్పుడొచ్చిందీ అక్కడికే.." నిర్ధారించాన్నేను.

"నిజమా..ఇది ఇలా.. ఇలా ఎలా మారింది..?"

"అవును, ఎలా జరిగిందీ మార్పు..." ఏళ్లక్రితంనాటి సంగతులు, వాటి కొనసాగింపు క్రమాలు ఒక్కటొక్కటిగా గుర్తొస్తున్నాయి....

'అమ్మాయ్...వీళ్లకో ముగ్గురు కావాలంట. మీరే చూసుకోండి' అన్నాడు. అప్పటికే వచ్చిన వారికి మా వాలకం సగం అర్థమై బండిపై ఉడాయించేందుకు ప్రయత్నించారు.

మాది కృష్ణా నది ఒడ్డునున్న చిన్న వాడ. మేం రాక మునుపిక్కడ ఊరు లేదు.మా రాకతోనే ఇదొక వాడైంది.. ఇప్పుడంటే బైపాసు రోడ్డుంది కానీ ఒకప్పుడు ఎదురుగా కనపడుతున్న టౌన్లోకి రావాలంటే చుట్టుతిరిగి ఆరేడు కిలోమీటర్లు నడవాల్సొచ్చేది. వరదలొచ్చి జనం మునిగిపోకుండా సర్కారోళ్లు కట్టిన కరకట్టకు అటూ ఇటూ మా నివాసాలు. ఇప్పుడా కట్టపై రోడ్డు, ఇళ్లల్లో కరెంటు, స్కూళ్లు, ఆసుపత్రి ఉన్నాయి గానీ రెండు దశాబ్దాల క్రితం...

పొద్దుగూకితే అదో చీకటి గుయ్యారం... చుట్టూ కంపచెట్లు...తమకు ఏమాత్రం అసౌకర్యం కలిగినా యథేచ్ఛగా సంచరించే తాచు, కట్లాది పాములు... పొరపాటున వాటి సామ్రాజ్యపు పరిసరాలలో ఎక్కువసేపు నిలబడితే కాలిపై పాకుతున్న పాము వెళ్లేవరకూ శిలావిగ్రహంలాగా నిలబడి హమ్మయ్య అనుకోవాల్సిందే..పాము అంటే పర్లాంగు దూరంలో నిలబడే నాలాంటి వాళ్లం కూడా ఒకట్రెండు పాములు చంపి ధీరోదాత్తులుగా సన్మానం పొందాల్సిన అనివార్య పరిస్థితన్నమాట. అలాంటిచోట్ల కూడా పేదలను మోసం చేసే దళారులు తయారయ్యారు. ఆ దళారుల ఆట కట్టించే అజెండా వల్లనే చాలామందికి పేదోళ్ల జెండాతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయమే నా కుటుంబాన్నీ అక్కడకు చేర్చింది. ఉన్న పరిస్థితుల దృష్ట్యా అందరికీ పలుకు తోడు కావాలి. కులాలు, మతాలు పట్టించుకుంటే అక్కడుండడమే కష్టం. ఏ రాత్రో దొంగలు పడొచ్చు. ఏపురుగో కుట్టొచ్చు.ఎవరో ఒకరికి అనారోగ్యం రావచ్చు. ఏదో ఒక అవసరం తప్పనిసరి కావచ్చు. సహజీవనం మాకు అనివార్యమన్నమాట. ఎక్కడ ఏఇంట్లో ఏ ఇబ్బందొచ్చినా మేమో పదిమందిమి హాజరు. దళారుల బాధల వల్ల మాతో సఖ్యంగా ఉంటే రక్షణ వుంటుందని ఎక్కువ మంది మాతో బావుండేవారు. మేం పట్టు సాధిస్తే ఆటలు సాగవు కనుక అందరితో కలివిడిగా ఉన్న నాతో సహా పలువురిని దళారుల్లో మిగిలిపోయిన ఆమాంబాపతు వారు. అడ్డమైన కూతలూ కూసేవారు.

మా వాడకు పేదోళ్ల కోసం చివరి వరకూ నిలబడిన మహనీయుని పేరు పెట్టుకున్నాం. ఆ ప్రాంతంలో సాగుతున్న చీకటి పనులెలా అరికట్టాలన్నది అప్పుడప్పుడే రూపుదిద్దుకుంటున్న మహిళా సంఘ సభ్యుల ఆలోచన. ఖాళీగా ఉన్నపుడు నాలుగు విషయాలు చెబుదామని ఎవరినైనా పిలిస్తే...

'రాత్రి ఎవరో తలుపులు కొట్టారమ్మాయ్...ఎవరా అని చూస్తే ఇద్దరు ముగ్గురు మగాళ్లక్కడ నిలుచొనున్నారు...ఎవరికోసం వచ్చారో ...ఏ కొంపల తలుపులు కొట్టబోయి మా గుమ్మం తొక్కారో...మీటింగులు బోటింగులంటూ తిరిగి కొంప మీదకు తెస్తే తోలు తీస్తా'నంటున్నాడమ్మాయ్" అంటూ ఎక్కువ మంది అనేవారు.

అందరి ఇళ్లకీ పోతూ పొద్దుగూకేదాకా కనిపించే వాళ్లం గనుక మాపై మంచి అభిప్రాయమే ఉండేది. కానీ ఏ పుట్టలో ఏ పాముందో అన్నది వారి సందేహం... మాకూ ఇదే ఆలోచన.

ఒక రోజు....

ఓ పదిమంది వరకూ మహిళలం కరకట్టపై పోసిన ఇసుక మీద కూర్చొనున్నాం. ఎదురుగా టౌన్లో వెలుగుతున్న దీపాలే మాకు వెలుతురు. ఏవేవో కబుర్లు .... సమయం గడిచిపోతోంది... అపుడపుడే పూర్తి కావస్తున్న వారధికి ఇవతల చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే వాళ్లు ఇళ్లకొస్తున్నారు. అలా వస్తున్న వారిలో ఒకరిని స్కూటరుపై వచ్చిన వ్యక్తులు ఆపి ఏదో అడుగుతున్నారు. వాళ్లేం అడుగుతున్నారో ఇవతలి వ్యక్తికి అర్థం కావడం లేదు. వారి వెనుక వచ్చి అంతా వింటున్న మరో మా నగర వాసికి సర్వం అర్థం అయింది. మా ఆలోచన కూడా తెలిసిన వ్యక్తి కావడంతో ఆ స్కూటర్‌వాలాలను మా దగ్గరకు తీసుకొచ్చాడు.

'అమ్మాయ్...వీళ్లకో ముగ్గురు కావాలంట. మీరే చూసుకోండి' అన్నాడు.

అప్పటికే వచ్చిన వారికి మా వాలకం సగం అర్థమై బండిపై ఉడాయించేందుకు ప్రయత్నించారు. ఆ బండి ఒక్క అడుక్కూడా కదిలే పరిస్థితి లేదు. ఆ ముగ్గురు మగాళ్లనీ పట్టుకుని అక్కడే ఉన్న చెట్టుకు కట్టేశారు. నేర పరిశోధక శాఖవారిని మించి ఇంకా ఇంకా ప్రశ్నలు వేశారు. కొందరైతే... 'సచ్చినోళ్లారా' అంటూ నెత్తిపై రంగున ఒకటిచ్చేవారు. మొత్తానికి ఆ రసికశిఖామణుల తాలూకు వారికి కబురు పెట్టి 'జాగ్రత్త' అంటూ హెచ్చరించి వదిలేశాం. తెల్లవారింది మొదలు...

తాము రాత్రి వాళ్లని ఎలా తిట్టిందీ, ఎన్ని నీతులు చెప్పిందీ వివరించడానికి రమ్మని కబురు చెయ్యంగానే ఏ దీర్ఘాలూ తియ్యకుండా వచ్చేశారు. అందరి మాటల్లో వ్యక్తమైన భావం ఒక్కటే...

'మన వాడకొచ్చి ఎదవ్వేషాలేస్తే ఇరగ్గొడతామని అర్థమైందమ్మాయ్...కాలం కలిసి రాక ఏదో ఇలా కట్టల కిందకొచ్చాంగానీ...గుణం తక్కువై కాదుకదా!

మనం అదీ ఇదీ అని అనుకుంటే ఎవరు కాపలాలు గాస్తారు? మనమే నాలుగు కళ్లతో కాపలా గాసుకోవాల... అమ్మాయోళ్లు చూడబట్టి వాళ్లు దొరికారు. లేకపోతే మన ఇళ్ల తలుపులు కొట్టుకుంటూ తిరిగేవాళ్లు కదా... మనం ఇళ్లల్లోనే ఉంటే ఎలా? ఇలాంటోటివి చూసుకోకపోతే ఎలా?' ఇదీ అందరి ప్రశ్న. ఎక్కడ ఏం జరిగినా మహిళాసంఘంలో ఉన్నోళ్లకు చెప్పాలని అనుకున్నారు.

మా ప్రాంతానికి వచ్చేవారిలో అనుమానితులుగా కనిపిస్తే చాలు ఒకటే పని. తాడు తీసుకోవడం, ఎప్పుడూ మేం సమావేశం జరిపే చెట్టుకు కట్టేయడం, ఆ్రలెడీ వెర్రివేషాలేసి

దొరికినోడైతే మరోరకంగా సన్మానించడం లాంటి బహుముఖ కార్యక్రమాల వల్ల మేం ఎపుడైనా బయటకు వెళ్లినపుడు మాది పలానా ప్రాంతం అని చెబితే చాలు ఎదుటివారి కళ్లల్లో భయం కనపడేది. మరికొందరు 'అమ్మో...ఆ వాడ ఆడోళ్లతో పని కాదురా బాబూ...' అనేవారు. ఈపేరు ఇలా బలపడీపడీ కొద్ది కాలంలోనే చీకటి కలాపాలు కనుమరుగయ్యాయి. వీటిని అరికట్టడంలోమా అందరి మధ్యా ఏర్పడిన అవగాహన అందరం కలిసి ఎక్కడికైనా రావడానికి సంకోచించని విధంగా వాతావరణం రూపుదిద్దుకుంది. ఏమైనా కొత్త కబురు తెలిస్తే చాలు మేముంటున్న నాలుగు కిలోమీటర్లలోని కరకట్ట వాసులు క్షణాల్లో కనీసం వందకు తగ్గకుండా పోగయ్యేవారు. వానొచ్చినా, వరదొచ్చినా మా ఇళ్ల రక్షణకూడా వదిలేసి పరిగెత్తేవాళ్లం. జనం సంబరాల్లో ఉండేవారం. సమస్యల్లోనూ అండగుండే వాళ్లం. మన ప్రాంతంలో మంచి విలువలను మనమే పెంచాలని అందరిలో అభిప్రాయం బలో విధంగా జరిగిన ఈ ఎపిసోడ్ సుఖాంతం కావడం మా విజయం" చెప్పడం ఆపాన్నేను

"ఇంత చక్కటి గాలిలో అలాంటి కాలుష్యాన్ని పారదోలారన్నమాట...తర్వాత..." మా వాళ్లంతా ఆసక్తి కనబరచడంతో ప్రారంభించాన్నేను.

"అవి సంక్రాంతి రోజులు. ఒకరోజు అక్కడి అరటి తోటల్లో కొందరు తాగి మా వాళ్లను అల్లరి చెయ్యడం మొదలెట్టారు. తాగినోళ్లని కొట్టడం ఎందుకని ఎంత ఉపేక్షించినా వాళ్ల ఆగడాలు మానలేదు. యథాప్రకారం ఓ నాలుగు తగలనిచ్చి, తాడు బొద్దు సూత్రాన్ని మావాళ్లు అమలు చేసేశారు. ఒకడెలాగో తప్పించుకుని పారిపోయాడు. అందరినీ చంపేశారనీ, తానొక్కడినే బతికి బట్టకట్టానని చెప్పాడట. తాగినోళ్లకు తెలివొచ్చాక పంపేద్దామని అందరం కూచొనున్నాం. దూరంగా...

అరుపులు...కేకలు...రెండు వాహనాల నిండా జనం... వారి చేతిలో కర్రలు, కత్తులు, గొడ్డళ్లు...ఏం జరుగుతోందో అర్ధమయ్యేలోపు తగలబడుతున్న ఇళ్లు, పాకల నుండి మంటలు ఎగిసి పడుతున్నాయి. వివరిస్తే వినే స్థితిలో వారు లేరు. ముందు మనల్ని మనం రక్షించుకోవాలి. వారింకా లోపలికొచ్చి మిగిలిన ఇళ్లను తగలబెట్టకుండా కాపాడుకోవాలి. అందుకని వారికి మనమే ఎదురెళ్లాలి. అంతే... చేతికి దొరికింది దొరికినట్లు ఉరికెత్తారు.ఆవెళ్లే వారిలో నడకకూ పరుగుకూ ఆట్టే తేడా తెలీని వయసులనుండీ కాళ్లూకీళ్లూ అరిగిపోతున్నాయని అంతకు ముందు రోజుల్లోనే డాక్టరుని కలిసిన వారి వరకూ ఉన్నారు. ఒక వైపు నీళ్లు చల్లుతూ కొందరు బిజీగా ఉన్నారు....దాడికి వచ్చినవారు చేతుల్లోని ఆయుధాలు పైకెత్తుతున్నారు. ఎత్తిన ఆయుధం ఏమౌతోందో తెలీడం లేదు. అంత ఉద్రిక్తతలోనూ మావాళ్లు మధ్యలో దూరబడి ఆయుధాన్ని అవతల వాళ్ల నుండి లాగేసి ఇవతల పడేస్తున్నారు.లాగే పెనుగులాటలో రక్తం కారుతున్నా లెక్క చేయకుండా నిలువరించారు. ఎక్కడెక్కడో దెబ్బలు తగిలినా పట్టించుకోలేదు. తర్వాత జరిగిందేమిటో తెలుసుకున్నాక గొడవ సద్దుమణిగింది. కానీ ఆరోజు ఎగిసిపడుతున్న మంటల వెలుగులో రౌడీలను అడ్డుకున్న మా వాళ్ల సాహసం, ఐక్యత ఉంటే రెండు కాదు రెండొందల లారీలొచ్చినా ఏమీ చెయ్యలేరనే విశ్వాసం మా మరో విజయం..

కలిసి మాటాడుకునేందుకొచ్చిన ఏచిన్న అవకాశాన్నీ మేం వదులుకోలేదు.అలాంటి వాటిలో అక్షరజ్యోతి ఒకటి.బడికెళ్లి ఏకాస్తా చెప్పగలిగిన సామర్ధ్యం ఉందనుకున్నా వారందరితో మాటాడాం.ఇల్లాలి చదువు...ఇంటికి వెలుగు...అక్షరదీపం వెలిగించు...అవనికి వెలుగులనందించు....అనేదాన్ని వివరించి చెప్పాం.మరొకరికి చదువు నేర్పించడమంటే దానికన్నా పుణ్య కార్యం మరొకటి లేదని నచ్చజెప్పాం.ఒకరిని చూసి మరొకరు..అలా అలా మాచిన్న ఏరియాలో నలభైమందికి పైగా వాలంటీర్లు...వారిలో విద్యార్ధులు,గృహిణులు ఒకరితో ఒకరు పోటీలు పడి తమ దగ్గరకు వచ్చిన పెద్దవారికి పాఠాలు చెప్పేవారు.ఎలా జరుగుతున్నాయో చూసేందుకు, ఏవైనా సమస్యలుంటే కనుక్కునేందుకు మా సంఘం టీము రెడీగా ఉండేది. ప్రతిరోజూ దాదాపు రెండు నుండి మూడొందల మందితో ఏదో ఒక రకంగా కలిసి మాటాడేందుకు మాకో చక్కటి వేదికన్నమాట. పనిలో పనిగా ముచ్చట్ల రూపంలో చెప్పే విషయాలు ఉండనే ఉన్నాయి.

మరో సందర్భంలో..

కృష్ణమ్మ పొంగింది.మావాడలోని చాలా ఇళ్లు కుంగాయి.కొన్ని పడిపోయాయి. ఇలా వానల్లోనూ చాలాసార్లు జరిగింది.దీన్నెలా అధిగమించాలన్నది ప్రశ్న.మా ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించాం.ఎత్తు పల్లాలను రూఢి చేసుకున్నాం. ఒకవైపునుండి వచ్చిన నీళ్లను మరో వైపు నుండి అదే కృష్ణమ్మలోకి పంపాలన్నది మా ఆలోచన. పెద్దల అనుభవాలు విన్నాం..చదివిన మాబుర్రలకీ పని పెట్టాం..మొత్తానికి పనిని ఖాయం చేశాం. ఫలానా రోజు, ఫలానా గంటకు, ఫలానా చోటు నుండి కృష్ణలోకి కాలువ తీయబోతున్నాం..అని అందరకూ కబురు చేశాం.

అనుకున్న రోజు రానే వచ్చింది

పొద్దున ఏడు గంటలైంది..నెత్తిన తట్ట..చేతిలో అన్నం బుట్ట.. భుజంపై పార..మరో చేతిలో పలుగు..చీమల బారుల్లా...తమ పనిలా.. అదిలించుకుంటూ... ఆహ్లాదపరుచుకుంటూ... సాయంత్రమైంది.. మా ప్లానింగులోని ప్రాంతానికీ, కృష్ణలోకి కాలువ తీయడానికీ మధ్య ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో చక్కటి కాలువ...ఏవర్షానికైనా నీరు పోకుండా ఆగిందీ అంటే మన కాలువ ఏమైందోనని నిత్య పరిశీలన...ఎందుకంటే అది మేం నిర్మించింది కాబట్టి...మావాడ కట్టుబాటు, సమిష్టి తనం, శ్రమించే గుణం ఆఊరి పంచాయతీనీ కదిలించింది. అందుకే మాకు సత్వరం కరెంటొచ్చింది.పేదోళ్ల బాగుకోరే వాళ్లు అండగున్నారు కనుక మా రోడ్డుకు మోక్షం కలిగింది. దేన్నయినా పోరాడి సాధించుకోవడం అలవాటుగా మారింది..అదే ఈ ఏరియాకు ఈరూపాన్ని తెచ్చింది..

'వారెవ్వా...గుప్పిటికెంత బలముందే...,అన్నట్టు అప్పుడెప్పుడో దేనికో మీ ఫ్రెండని చెబుతుంటావ్ తనిక్కడ నుండి ఎందుకో గెలిచినట్టుంది కదే...ఏమాత్రం వదిలిందేమిటి?'

"తనకా...ఖర్మ..." నా మాట పూర్తిగానే లేదు..

"అదేమిటే తల్లీ...నేనా...కాలేజీకా అని సంతూర్ యాడ్‌లో అంటుందే అంత బిల్డప్ ఇచ్చావ్..."

'యాడ్ సంగతేమిటో నాకు తెలీదుగానీ..జనంకోసం తిరిగి నిజ్జంగా పనులు చేసేవాళ్లను జనం గెలిపించుకుంటారే...వాళ్ల ఐక్యతకంత బలముందిమరి...'

'మరిక్కడింత మంది ఇంత కట్టుగా ఉన్నారు కదా...మీకు వ్యతిరేకంగా నిలుచున్నోళ్లకే మాత్రం వదిలిందేమిటి?

ఉన్న కొంపా...ఇన్నేళ్లూ సంపాదించుకున్న ఆస్తి..చెప్పాన్నేను.

అవునా..వాళ్లకసలెవరూ ఓట్లేయలేదా..?

ఎందుకేయలేదు?పంచాయతీలో మాదో సెగ్మెంటు కదే..ఆసెగ్మెంటులో మావాడ ఒక భాగం మరి...మిగిలిన చోట్ల మా ఫ్రెండుకన్నా ఎగస్పార్టీ వాళ్లకే ఓట్లెక్కువొచ్చాయి.ఓసెగ్మెంటులో వందల మెజారిటీ రావడమంటే ఇవతల వాళ్లు ఆశలొదులుకోవాల్సిందేనే...కానీ మావాడుంది చూశారూ...అవతల వాళ్లు నానా గడ్డీ కరిచి సాధించిన మెజారిటీని అలా అలా తగ్గించి మా ఐక్యతను బల్లలు గుద్ది మరీ చాటిచెప్పిందే..జనం ఆశీర్వదించిన తర్వాత ఎవరూ ఏమీ చెయ్యలేరు..ఇది మా వాడలో మేం కనిపెట్టిన కొత్త సంగతేమీ కాదర్రా...చరిత్రను కాస్త విశ్లేషించి చదివితే అర్ధమయ్యే విషయాలే..జనం ముందు ఎంత వారైనా బలాదూరే... సంఘమోళ్ల ,,పేదల జెండా అండగా ఉంటే దేన్నయినా అడ్డుకుంటామని చేతల్లో చూపిన సంఘటనలెన్నో... సంఘమోళ్ల అజెండా, వాళ్లను నడిపిన జెండా, ఆ జెండాను మోస్తున్న జనం.... ఆ జనాన్ని కదిలిస్తూ, కదులుతూ నీళ్లల్లో చేపలా సంఘం.... ఉద్వేగంగా....ఉత్తేజంగా....ఈరోజుకీ...' నా మాట పూర్తి కాకముందే

'సమస్య మూలాన్ని పట్టుకుని దానికి జనాన్ని ఐక్యం చేసి నిలబెట్టిన నీ జెండా, నువ్వు నమ్మిన అజెండా ఏదైనా సరే ఈప్రాంతం లాగానే మార్పు తెస్తుందని నమ్మకం కలుగుతోందే మాకు'

అప్పటికే పొద్దు ఎర్రబారింది..ఆ ఎరుపు మా ఇంటికళ్లంత దూరాన కార్యాలయంపైనున్న జెండామీద పడుతోంది. చిరుగాలికి ఆ జెండా వెన్నెల కొండలా..మా వాడ కోసం తననే త్యాగం చేసుకున్న అచ్చం మా అన్నలా అలా ఎగురుతూనే ఉంది.

★

ఆరోగ్యం

గ్యాస్ ట్రబుల్ తగ్గేదెలా?!

గ్యాస్ ట్రబుల్‌తో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తక్షణ నివారణకు ట్యాబ్లెట్లపై ఆధారపడుతుంటారు. గ్యాస్‌ట్రబుల్‌కు ప్రధాన కారణం సరైన ఆహార నియమాలను పాటించకపోవడం. గ్యాస్‌ట్రబుల్‌ను తగ్గించుకునేందుకు మందులు వాడాల్సిన అవసరం లేదు. ఆహార నియమాలను పాటిస్తే మందుల జోలికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే తగ్గుతుంది. అసలు గ్యాస్ ట్రబుల్ అంటే ఏంటి? ఏ వయసు వారికి వస్తుంది? లక్షణాలు, కారణాలు, రాకుండా జాగ్రత్తలు, చికిత్స వంటి వివరాలు మీకోసం...

అసలు గ్యాస్ ట్రబుల్ అంటే.. శరీరంలో ఎక్కువగా హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉత్పత్తి అవ్వడం.

లక్షణాలు...

మాటి మాటికి తేపులు రావడం, గుండెల్లో మంట, ఛాతీలో గ్యాస్ ఇరుక్కుపోయినట్లు అనిపించడం, గుండె బరువుగా అనిపించడం, పొత్తి కడుపు పైభాగాన నొప్పిగా, అసౌకర్యంగా ఉండడం, ఆహారం అజీర్ణం కావడం, పలుమార్లు అపాన వాయువులు బయటికి వదులుతుండడం, ఒకేసారి కాకుండా అనేకసార్లు మలవిసర్జనకు వెళ్లడం, మలం జిగటగా దుర్వాసన ఉండడం, విసర్జించేటప్పుడు పరపరా శబ్దం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వారిలో గ్యాస్ ట్రబుల్ ఉన్నట్లు.

ఏ వయసు వారికి వస్తుంది?

ఏ వయసు వారికైనా రావచ్చు. అయితే సాధారణంగా 20 నుంచి 60 ఏళ్ల వయసు వారు దీని బారిన పడతారు. ఇది ఉత్తరాదిన ఉన్న వారికంటే దక్షిణాది వారిలోనే ఎక్కువ వస్తుంది. ఎందుకంటే ఉత్తరాది వాళ్లు టిఫిన్‌లో స్వీట్లు తీసుకుంటారు. కానీ దక్షిణాది రాష్ట్రాల్లో ఇడ్లీ, దోశ, వడ లాంటి టిఫిన్లలో చట్నీలు, సాంబార్ ఎక్కువగా ఉంటాయి.

డాక్టర్ ఎంజి జయన్
గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్
మెడిసిటీ హాస్పిటల్స్
హైదరాబాద్.
ఫోన్ : 9000177708

కారణాలు

ఖాళీ కడుపు వల్ల

కడుపు ఖాళీగా ఉంచితే పొట్ట లోపల హైడ్రోక్లోరిక్ ఆమ్లం బాగా ఉత్పత్తి అవుతుంది. ఈ రోజుల్లో బరువు తగ్గించుకోవడం కోసం చాలా మంది టిఫిన్, లంచ్‌ను ఎగ్గొట్టడం ఫ్యాషన్‌గా మారింది. ఇలా తరచూ జరగడం వల్ల గ్యాస్ ఎక్కువ ఉత్పత్తి అవుతుంది.

సరైన ఆహార నియమాలు

వేళకు టిఫిన్, భోజనం చేయకపోవడం, వేపుడు, మసాలా కూరలను తినడం. కడుపులో ఎంత పడితే అంత ఆహారాన్ని కుక్కడం గ్యాస్ తయారవ్వడానికి దోహదం చేస్తాయి.

కూల్‌డ్రింక్స్

కోలాపానీయాలు, సోడానీళ్లు, బీరు లాంటి డ్రింక్స్‌ను అతిగా తాగితే ఇందులో ఉండే కార్బనేషన్ మూలంగా కడుపులో గ్యాస్ ఉత్పత్తి అవుతుంది.

మద్యం, ధూమపానం

సిగరెట్లలో ఉండే నికోటిన్ పదార్థం హైడ్రోక్లోరిక్ యాసిడ్‌ను ఉత్పత్తి చేసే గ్రంథులను ప్రేరేపిస్తుంది. ఆల్కహాల్ కడుపు లోపలి పొరను చికాకు పరుస్తుంది. ఈ రెండు సందర్భాల్లోనూ కడుపులో గ్యాస్ ఉత్పత్తి అవుతుంది.

స్థూలకాయం

స్థూలకాయం కూడా గ్యాస్ ట్రబుల్‌కు కారణం. శరీరానికి తగ్గ శ్రమ, శారీరక వ్యాయామం లేకపోతే తీసుకున్న ఆహారం సరిగా జీర్ణంకాక గ్యాస్ ఉత్పత్తి అవుతుంది.

మహిళల్లో

నలభై ఏళ్లు దాటి, స్థూలకాయులైన మహిళల్లో తిన్నది అరగక ఒకటే తేన్పులు వస్తాయి. దీర్ఘకాలికంగా గ్యాస్ ట్రబుల్‌తో బాధపడుతున్న వాళ్లు డాక్టర్ సలహా మేరకు అల్ట్రాసోనోగ్రఫీ పరీక్ష చేయించుకోవాలి.

అమీబియాసిస్

ఇటీవల కాలంలో నగరాలు, పట్టణాల్లో నివసించే వారిలో అమీబియాసిస్ ఇన్‌ఫెక్షన్ సాధారణమైంది. కూరగాయలు సరిగా కడగకపోవడం, రోడ్డుపక్కన లభించే అపరిశుభ్రమైన ఆహారాన్ని తినడం, నీళ్లను తాగడం వల్ల ఈ ఇన్‌ఫెక్షన్ వస్తుంది. ఈ ఇన్‌ఫెక్షన్ ఉన్న వ్యక్తి కొంచెం ఆహారం తీసుకున్నా గానీ కడుపు నిండినట్లుగా ఉంటుంది. అమీబియాసిస్ కాక ఇరిటేబుల్ బౌల్ సిండ్రోమ్ వల్ల కూడా కడుపులో గ్యాస్ వస్తున్నట్లు, మలవిసర్జన కలుగుతున్నట్లు అనిపిస్తుంది. అయితే ఎండోస్కోపి పరీక్షతో గ్యాస్ ట్రబుల్‌ను నిర్ధారించే అవకాశం కూడా వుంది. ఎండోస్కోపితో కాలేయ సంబంధ సమస్యలనూ గుర్తించొచ్చు.

భోజన సమయంలో నీళ్లా?!

మనలో చాలా మందికి ఒక అలవాటు ఉంటుంది. భోజనం చేసేటప్పుడు నీళ్లు తాగడం. లేకపోతే భోజనం చేసిన వెంటనే నీళ్లు తాగడం. ఇది మంచి పద్ధతి కాదు. భోజనం చేసిన అరగంట తర్వాత మాత్రమే మంచినీళ్లు తాగాలి. గ్యాస్‌ట్రబుల్‌తో బాధపడేవారు భోజనంతోపాటు మంచి నీళ్లు తాగితే కడుపు నిండుగా ఉబ్బరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. దీనివల్ల మరింత అసౌకర్యంగా ఉంటుంది.

(మిగతా వివరాలు పైవారం)

మూడు వేల సంవత్సరాల క్రితమే ముఖాలంకరణ

అందంగా కన్పించడానికి మగువలతో పాటు మగవారూ పోటీ పడుతుంటారు. ఈ పోటీలో అందరికన్నా ముందున్నట్లుగా చెప్పబడుతున్న ఒక యూరోపియన్ వనిత క్రీ.పూ. ఆరవ శతాబ్దంలో లెడ్‌తో తయారయిన ముఖాలంకరణ సామాగ్రిని వాడిందట. అయితే లెడ్‌తో తయారయిన సామాగ్రితో యూరోపియన్ మహిళలు మూడు వేల సంవత్సరాల క్రితం నుండే తమ ముఖాలను అలంకరించుకుంటున్నారని ఆర్కియాలజిస్టుల బృందం తెలుపుతున్నది. బ్రిటీష్ మెడికల్ జర్నల్ 'ది లాన్సెట్' ప్రచురించిన ఆ స్వతంత్ర పరిశోధనల ప్రకారం వారు 3000 నాటిదని చెప్పబడుత్ను ఒక గ్రీస్ సమాధిలో 50 గ్రాముల ఫేస్ పౌడర్ కనుగొన్నారట. స్త్రీలే కాదు. పురుషులైనా లెడ్‌తో తయారైన అలంకరణ సామాగ్రిని వాడినట్లయితే వాంతులు, మలబద్ధకం, తలనొప్పులతో బాధపడక తప్పదని, అంతేకాక వారి వ్యక్తిత్వాలలో కూడా మార్పులు చోటు చేసుకొనే ప్రమాదముందని శాస్త్రజ్ఞులు నొక్కి చెబుతున్నారు.

మృత సముద్రం సార్థక నామధేయం

మృత సముద్రం (డెడ్ సీ) సముద్రం ఎంత మాత్రమూ కాదు. అది ప్రపంచంలోని సరస్సులలో ఒక చిన్న సరస్సు మాత్రమే. ఈ మృత సముద్రంలోకి జోర్డాన్ నది, ఇతర చిన్న ప్రవాహాల ద్వారా నీరు చేరుతున్నది. కానీ దీని నుండి బయటకు ప్రవహించే నదులుకానీ, ప్రవాహాలు కానీ ఏవీలేవు. కనుక దీనిలోని నీరు ఆవిరవడం ద్వారానే తగ్గుతుంటుంది. ఇలా సూర్యకాంతి ద్వారా, పైభాగాన ఆవిరయ్యే నీటిలోని లవణాలు, ఇతర ఖనిజాలు సరస్సులో మిగిలిపోతుండడంతో మృత సముద్రంలోని నీరు ఎప్పుడూ 28 శాతం లవణాలతో నిండి వుంటోంది. ఈ ఉప్పు శాతం ఎక్కువ కావడం మూలంగా ఈ నీటిలో మునగడం కష్టం. అలాగే ఈ మృత సముద్రంలో మామూలుగా నీటిలో లాగా దుమకడం చాలా కష్టం. దీనిలో ఈదడం కూడా అంత తేలికైన విషయం కాదు. ఉప్పు శాతం ఎక్కువ ఉండడం మూలంగా దీనిలో మొక్కలు పెరగవు. చేపలు, ఇతర సముద్ర జీవులేవీ దీనిలో మనలేవు. అందుకనే దీనికి మృత సముద్రమనే పేరు వచ్చింది. సార్థక నామధేయం కదూ!



తెలుసా!



బుసకొట్టే పక్షి

వడ్రంగిపక్షి జాతికి చెందిన వంకరమెడ (రైనెక్) పక్షి చాలా చిన్నగా వుంటుంది. దీనినే పాముపక్షి అని కూడా పిలుస్తారు. ఇది భయపడినపుడు పాములాగా బుసకొట్టడమేకాక పాము భంగిమలను అనుకరిస్తుంది. దాని గూటి నుండి తల బయటకు పెట్టి పాము పడగవిప్పి చుట్టూ చూస్తూ ఎలా బుసకొడుతుందో అలానే తల తిప్పుతూ బుసకొడుతుంది. ఈ రైనెక్ పక్షులు యూరప్, ఆసియా, పశ్చిమోత్తర ఆఫ్రికా ప్రాంతాలలోనూ, శీతాకాలంలో ఆఫ్రికా ఇండియాలలోనూ అధికంగా కన్పిస్తాయి. చెట్ల కాండాలకుండే రంధ్రాలను, గోడలకు వుండే రంధ్రాలను ఇవి తమ గూళ్ళుగా ఉపయోగిస్తుంటాయి. అయితే ఇవి గూటిని అల్లడానికి ఏ విధమైన తీగలను ఉపయోగించవు. వడ్రంగి పక్షి జాతికి 'చెందినప్పటికీ ఈ రైనెక్ పక్షి ఆహారం కోసం చెట్ల రంధ్రాలను పొడవదు. ఇవి తమ పొడవాటి నాలుకను ఉపయోగించి చెట్ల బెరళ్ళతో, ఆకులమీద, పగుళ్ళలో వుండే చిన్న చిన్న పురుగులను ఏరుకొని తింటాయి.

చీమల పుట్టలు కాదు చీమల కొండలే

మన దేశంలో పాముల పుట్టలు చూస్తుంటాం కదా! అవి చీమలు నిర్మించినవేనని అంటుంటారు. ఇవి రకరకాల ఆకృతులలో వుంటుంటాయి. అయితే ఉత్తర ఆస్ట్రేలియాలో చీమలు నిర్మించే పుట్టలను నిస్సందేహంగా కొండలు (యాంట్ హిల్స్) అనే పిలుస్తారు. పది మీటర్ల వెడల్పుతో 12 నుండి 20 మీటర్ల ఎత్తు వరకూ నిర్మించబడిన చీమల పుట్టలు (కొండలు) వున్నాయి. ఈ ప్రాంతాల్లో ఇసా, డార్విన్ కొండలు మధ్య ఇటువంటి అతి పెద్ద చీమల పుట్టలు వేలకొద్దీ వున్నాయి. రాతితో నిర్మించి శిఖరాల్లా వుండే ఇవి పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇటువంటి చీమలు పుట్టలు ఆఫ్రికాలో కూడా అక్కడక్కడా కన్పిస్తుంటాయి. విశేషమేమిటంటే ఈ పుట్టలను నిర్మించే చీమలు కూడా పెద్దవి కాబోలనుకునేరు. అవి బియ్యపు గింజ పరిమాణానికి తక్కువగా వుండే చీమలే.



స్నేహం-3

బీర్బల్ కథలు

వచ్చే వారం మరోకథ

సుడోకు చేద్దామా...

హాలో బుజ్జాయిలూ... కిందున్న పెద్ద బాక్సులో 9 చిన్న బాక్సులు వున్నాయి. మరలా ప్రతి బాక్సులో 9 గడులున్నాయి. వాటిలో ఒకటి నుండి తొమ్మిది వరకు అంకెలు వేయండి . అయితే ప్రతి వరుసలోనూ ఒక అంకెను ఒక సారి మాత్రమే వాడాలి. చేయడం మొత్తం పూర్తయిన తర్వాత మా జవాబుతో సరి చూసుకోండి.

		1		2	9			
	2	7	8					6
5						2		
		5	2	8				
	7			1			5	
				7	3	9		
		8						4
3					5	8	6	
			6	3		5		



దారి కనిపెట్టేస్తే

నేర్చుకుందాం



జవాబులు

<u>అవి ఎక్కడున్నాయ్?</u> : ఎడమ వైపు కింద రెండు చేపలు, వాటిపైన బాతు, దానిపైన ఎలుగుబంటి తల, దానికి కొంచెం పైన గుడ్లగూబ, గుడ్లగూబకి కుడివైపు పక్షి తల, పక్షి తలకి కొంచెంపైన జింక తల, దాని పక్క చెట్టు కొమ్మకు చుట్టుకుని పాము, పాముకి కిందివైపు కుందేలు, దానికి ఎడమ పక్క కప్ప తల.

<u>సుడోకు?</u> :

8	6	1	3	2	9	4	7	5
4	2	7	8	5	1	3	9	6
5	3	9	4	6	7	2	8	1
9	4	5	2	8	6	7	1	3
2	7	3	9	1	4	6	5	8
1	8	6	5	7	3	9	4	2
6	5	8	7	9	2	1	3	4
3	9	2	1	4	5	8	6	7
7	1	4	6	3	8	5	2	9

బాలనేస్తాలు

అవి ఎక్కడున్నాయ్?

హాయ్ పిల్లలూ.. ఒక చిన్న అడవి. అందులో ఒక చిన్న పొద. ఆపొదలో కొన్ని ప్రాణులు... ఏంటీ కథ అనుకుంటున్నారా? కథ కాదు. కింద బొమ్మ చూస్తే మీకే అర్థమౌతుంది. ఇక్కడ పాము, గుడ్లగూబ, కుందేలు, రెండు చేపలు, జింక, కప్ప, పక్షి, ఎలుగుబంటి, బాతు ఉన్నాయి. కానీ అవి ఎక్కడో గుర్తించి సున్నా చుట్టండే....



జత చేద్దాం

పిల్లలూ ఇక్కడ చాలా ఆకులు ఉన్నాయ్. అవి అన్నీ జతగా ఉన్నాయి. కానీ ఏది ఎక్కడుందో తెలియదు. వాటిని జత చేద్దామా.





పేపర్ వీల్

చేద్దామా



హాయ్ నేస్తాలూ! వేసవి కాలం... అందునా సెలవులు. ఇంత మనకు బోలెడంత హుషారు. కావాల్సినంత టైమ్ వుంటుంది. కానీ ఏం చేయాలో తోచదు. అందుకే ఇక నుంచి మీకోసం వారం వారం ఒక క్రాఫ్ట్ గురించి చెప్దామనుకుంటున్నాం. ఊ... ఈ వారం ఏం నేర్చుకుందాం? ఆ... పేపర్ వీల్ గురించి చెప్పకుందామా? ఓకేగా...అయితే ఎందుకాలస్యం? మొదలెట్టేద్దాం.

ఏమేం కావాలంటే...

తెల్ల కాగితం, కత్తెర, కొంచెం మందపాటి స్ట్రా, ఒక పేపర్ పిన్, క్రేయాన్లు/ స్కెచ్ పెన్నులు.

ఎలా చేయాలంటే...

ముందుగా కాగితాన్ని తీసుకోండి. చదరంగా వుండాలని మరువకండే. దాని మీద స్కేలు పెన్సిల్‌తో లొక మూల నుంచి మరో మూల వరకు గీతలు గీయండి. ఇలా నాలుగు మూలల్లోనే చేయాలి. ఇప్పుడు సరిగ్గా పెన్సిల్ గీతలమీద పేపర్‌ను మడతపెట్టండి. సరిగ్గా మధ్యలో నాలుగు గీతలు కలిసే చోట పెన్సిల్‌తో ఒక చుక్క పెట్టుకోండి. ఇప్పుడు నాలుగు గీతలు కనిపిస్తాయి కదా. ఒక్కొక్క గీత మీద మూడవ వంతు దగ్గర పెన్సిల్‌తో చుక్క పెట్టండి. తర్వాత కత్తెరతో అక్కడి వరకు కత్తిరించండి. ఇప్పుడు ఒక్కొక్క పేపర్ కొనను తీసుకొని మధ్యలోకి తీసుకొచ్చి వేలితో పట్టుకోండి. ఇలా నాలుగు మూలలు చేశాక పేపర్ పిన్ తీసుకొని సరిగ్గా మధ్యలో గుచ్చండి. ఇప్పుడు దీన్ని స్ట్రా చివరి భాగంలో జాగ్రత్తగా గుచ్చాలి. అంతే పేపర్ వీల్ రెడీ. దీన్ని పట్టుకుని ఎంచక్కా గాలిలో పరిగెడుతుంటే భలేగా తిరుగుతుందిలే.

మరి ఈవారానికి ఇది నేర్చుకోండి. పై వారం మరో క్రాఫ్ట్ నేర్చుకుందాం. ఎదురుచూస్తుంటారుగా. అందాకా బైబై.

- చూటీ

అట్టమీది కథ

మంత్రాలయ్

ఎన్నికలు ముగిశాయి. మూడు వారాల్లో గెలుపు ఓటములు తెలుస్తాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ప్రభుత్వం అంటే ముఖ్యమంత్రి, ఆయన ఎంచుకునే మంత్రులు. అసలు ప్రభుత్వ నిర్వహణలో సచివాలయం పాత్ర ఏమిటి? ఈ వారం అట్టమీదికథ మీకోసం ప్రత్యేకంగా...

- మణి

మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శుల కార్యాలయ సముదాయమే సచివాలయం. దీన్నే కొన్ని రాష్ట్రాల్లో 'మంత్రాలయ్' అని పిలుస్తారు. శరీరంలో మెదడుకు ఎంతటి ప్రాధాన్యత వుందో ప్రభుత్వ వ్యవస్థలో సచివాలయానిది అంత కీలక పాత్ర. శాసనసభల ఆమోదంతోగానీ చట్టాలు అమల్లోకి రావు. కాని చట్టాలను రూపొందించడంలో సచివాలయానిదే ముఖ్య పాత్ర. ప్రభుత్వ విధివిధానాలు, వివిధ పథకాలు, ప్రణాళికలు అన్నీ ఇక్కడే రూపుదిద్దుకుంటాయి. శాంతిభద్రతలు, ఆదాయవ్యయాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ విధానాలు బదిలీలు, ప్రమోషన్లు, జీతాలు భత్యాల విడుదల, నిధుల మంజూరు ఇలా పరిపాలనకు సంబంధించిన ఏ అంశానికైనా సరే ఇక్కడి అధికార ముద్ర పడాల్సిందే.

జవాబుదారీ వీరే ....

రాజ్యాంగ పరంగా ప్రభుత్వం అంటే ముఖ్యమంత్రి. మిగిలిన వారంతా ఆయనకు సహాయకులే. ప్రమాణ స్వీకార తరుణంలో ఆయన ఒక్కరే పదవీ ప్రమాణం స్వీకరించడం అప్పుడప్పుడూ చూస్తుంటాము. అయితే అన్ని శాఖలను ఒక్కరే చూసుకోవడం అసంభవం గనక వాటికి మంత్రులను నియమిస్తారు. నిర్ణయాలన్ని వాటి స్వభావాన్ని బట్టి ముఖ్యమంత్రి లేదా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా దానికి సంబంధించిన శాఖలన్నిటినీ చుట్టి వచ్చిన తర్వాతనే ఆమోదం పొందుతాయి.

ప్రభుత్వ యంత్రాంగానికి రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి... కేంద్రంలో మంత్రిమండలి కార్యదర్శి (కేబినెట్ సెక్రటరీ - సిఎస్) అత్యున్నత అధికారి. ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రికి, మంత్రి వర్గానికి సిఎస్ జవాబుదారీగా వుంటాడు. ప్రభుత్వ కార్యదర్శులు, శాఖాధిపతులు వివిధ ప్రభుత్వ సంస్థలు సిఎస్ పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తారు. సచివాలయంలో వివిధ శాఖలు ఆయా ప్రభుత్వ కార్యదర్శుల పర్యవేక్షణలో పనిచేస్తాయి. వివిధ శాఖాధిపతులు ఆయా సచివాలయ శాఖల నియంత్రణలో పనిచేస్తారు.

పని విభజన తప్పనిసరి

సచివాలయంలో ప్రతిశాఖకు నిర్దిష్టమైన పని విభజన ఉంటుంది. వివిధ శాఖలకు కార్యదర్శులుంటారు. విభాగాల కార్యకలపాలను పర్యవేక్షించడానికి సహాయ కార్యదర్శులు ఆపైన ఉపకార్యదర్శి లేక సంయుక్త కార్యదర్శి లేదా అదనపు కార్యదర్శి వుంటారు. క్లరికల్ సిబ్బంది సరేసరి.

ఆర్థికశాఖ ఆమోదం కావాల్సిందే!

ఇందులో ఆర్థిక శాఖ ప్రత్యేకమైనది. ఎందుకంటే ఆర్థిక భారం పడే ఏ కీలక నిర్ణయమైనా అక్కడ ఆమోదం తీసుకోవలసిందే. ఆ శాఖలో గణకాధికారులు (స్టాటిస్టీషియన్స్) వుంటారు. సహాయ కార్యదర్శులు ఆ గణకాధికారులు విభాగాల పనిని పర్యవేక్షిస్తారు. ఇక్కడ మామూలు ప్రమోషన్ల

పద్ధతిలో అందరినీ ఈ పదవుల్లోకి తీసుకోరు. ప్రభుత్వ కార్యదర్శులు, వ్యక్తిగత కార్యదర్శుల నుండే ఆర్థిక శాఖ సహాయ కార్యదర్శుల నియామకం జరుగుతుంది. ఆర్థిక శాఖలో ప్రతిపాదనలు విభాగాల నుండి గణకాధికారులకు లేక సహాయ, ఉప, సంయుక్త, అదనపు కార్యదర్శులకు ఆ పై ప్రభుత్వ కార్యదర్శికి లేదా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి చేరతాయి. ఇది లెవెల్ జంప్. ప్రతిపాదనల పరిశీలనలో జాప్యాన్ని నివారించడానికి ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు.

సచివాలయ శాఖలలో వచ్చిన ప్రతిపాదనలను పని విభజనను బట్టి ఆయా విభాగాల సహాయ కార్యదర్శులకు పంపుతారు. వారు ఆ ప్రతిపాదనలను సంబంధిత సెక్షన్లకు పంపుతారు. ప్రాథమిక పరిశీలన సెక్షన్లలో మొదలవుతుంది. ప్రతిపాదనలకు సంబంధిత నియమాలను విభాగాలు పొందుపరచి ఆదేశాలకోసం పైఅధికారులకు సమర్పిస్తారు. ఒకవేళ ప్రతిపాదనలు నియమాలకు అనుగుణంగా లేకుంటే నియమాలను సడలించి గతంలో తీసుకున్న నిర్ణయాలను అందువలన కలిగిన పరిణామాలను కూడా జతచేస్తారు. ఇవన్నీ కలిపి సమర్పించే దాన్నే నోటు అంటారు.

విభాగపు సహాయ కార్యదర్శి ఆ నోటును పరిశీలిస్తాడు. ప్రతిపాదనలు నియమాలకు అనుగుణంగా వున్నాయా, లేకుంటే నియమాలను సడలించాలా లేక సవరించాలా, దాని వల్ల కలిగే పరిణామాలు ఏమిటి అన్నది ఈ పరిశీలనలో వెల్లడవుతాయి. వాటన్నిటినీ పొందుపరుస్తూ ప్రతిపాదనలు ఆమోదించవచ్చా లేదా అన్నదానిపై తన అభిప్రాయం సూచిస్తూ తన పైఅధికారులకు పంపిస్తాడు. అంటే ప్రభుత్వ ఉపకార్యదర్శి, లేదా ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి లేదా ప్రభుత్వ అదనపు కార్యదర్శికి సమర్పిస్తారు. దానిపై వారు కూడా పరిశీలన జరిపి తమ అభిప్రాయాలు రాసి సంబంధిత ప్రభుత్వ కార్యదర్శి లేదా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి లేదా ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శికి పంపాలి. ప్రతిపాదనలు సమగ్రంగా లేకపోతే వాటిపై ఆయా శాఖల నుండి ఇంకా వివరాలు కావలిస్తే ఆ శాఖాధిపతుల నుండి ఆ వివరాలు కోరతారు. ప్రతిపాదనలు సమగ్రంగా వివరాలు అందిన తర్వాత వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రతిపాదనలలో ఆర్థిక పరమైన అంశాలు ఉంటే ఆర్థిక శాఖకు, న్యాయపరమైన అంశాలు ఇమిడి ఉంటే న్యాయశాఖకు సర్వీసు విషయాలు ఉంటే ప్రధాన పరిపాలనా శాఖకు పంపుతారు. ఆర్థిక, న్యాయ, ప్రధాన పరిపాలన శాఖలను సంప్రదింపుల శాఖలుగా వ్యవహరిస్తారు. ఈ సలహాలు అందిన తర్వాత తమ తమ అధికారాల పరిధిలో నిర్ణయం తీసుకుంటారు. తమ పరిమితిలో లేని ప్రతిపాదనలపై సంబంధిత మంత్రి, ఆ పరిధి దాటితే ముఖ్యమంత్రి కేంద్రంలోనైతే ప్రధానమంత్రి ఆదేశాలు తీసుకుంటారు.

కొన్ని ప్రతిపాదనలు మంత్రివర్గంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. కొంతమంది శాఖాధిపతులు పదవిరీత్యా కార్యదర్శిగా వ్యవహరిస్తారు. వారి వారి కార్యాలయల నుండి ప్రతిపాదనలు నేరుగా సంబంధిత మంత్రికి పంపుతారు. దీని వలన జాప్యం తగ్గుతుంది. ప్రజాప్రతినిధుల నుండి లేదా నేరుగా సచివాలయానికి వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖాధిపతులకు వివరణకోరుతూ ఆయా దరఖాస్తులను పంపుతారు. ఉత్తర ప్రత్యుత్తరాలను కరెంట్ ఫైలంటారు. పైన చెప్పిన విధంగా అధికారులు వారి పరిమితులను బట్టి వాటిపై ఆదేశిస్తారు. విభాగాల నోటు, ఆదేశాలు అని అంటారు.

ఫైల్ సమర్పించేటప్పుడు...

ఫైల్ సమర్పించేప్పుడు ఆయా ప్రస్తావనలు ఉన్న చోట ఈ పత్రాలు ఎక్కడ పొందుపరిచారో నోటు ఫైల్ మీద పెన్సిల్‌తో సూచిస్తారు. దీనిని రిఫరెన్సింగ్ అంటారు. కరెంట్ ఫైల్, నోట్ ఫైల్, సంబంధిత పత్రాలు ఇవన్నీ కలిసి ఒక ఫైల్ అవుతుంది. ఆర్థిక శాఖలో, న్యాయశాఖలో వివిధ సచివాలయ శాఖల నుండి ప్రతి పాదనలను షాడో ఫైల్ పైనే పరిశీలిస్తారు.

ఆ శాఖ ప్రభుత్వ కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి లేదా వారి ఆదేశాలను అనుసరించి ఆ ఉత్తర్వులను ప్రధాన ఫైల్‌పై సూచిస్తారు. ఆర్థిక శాఖ వారి సలహా ఆ శాఖకు నచ్చకపోతే వారు ఆ ప్రతిపాదనలపై సంబంధిత కార్యదర్శి, ఆర్థిక కార్యదర్శి, సంబంధిత మంత్రి, ఆర్థిక మంత్రి ఆపై ముఖ్యమంత్రి ఆదేశాలు పొందాలి. దీనిని ఫైల్ ఇన్ సర్కులేషన్ అంటారు.

కార్యదర్శుల స్థాయి దాటి మంత్రి లేదా మంత్రుల ఆపై ముఖ్యమంత్రి లేదా గవర్నర్ ఆమోదానికి ఫైల్‌ని పంపడాన్ని సర్కులేషన్ అంటారు. ఫైల్ అంతా మంత్రులు చదివి ఆకళింపు చేసుకుని తగు ఆదేశాలు వేయడానికి ఫైల్ లోని సారాంశం నోటుగా రాసి సమర్పిస్తారు. దానిని నోట్ ఫర్ సర్క్యులేషన్ అంటారు. అదే విధంగా మంత్రిమండలికి కూడా సారాంశం తయారు చేసి సమర్పిస్తారు. మంత్రిమండలికి ఈ సారాంశ పాఠం ప్రతి చేరుతుంది. మంత్రిమండలి సమావేశానికి ప్రభుత్వ కార్యదర్శి లేదా ముఖ్యకార్యదర్శి ఆ ఫైల్‌తో హాజరవుతారు. మంత్రిమండలి సమావేశాలు ముఖ్యమంత్రి లేదా ప్రధాన మంత్రి అధ్యక్షత జరుగుతాయి. కేంద్రంలో కేబినెట్ సెక్రటరీ రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంత్రిమండలికి కార్యదర్శిగా వ్యవహరిస్తారు. మంత్రిమండలి తీర్మానం సంబంధిత శాఖకు చేరిన తరువాత ఉత్తర్వులు జారీ అవుతాయి.

శాసనసభా సమావేశాల సమయాలలో సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు లేదా కట్ మోషన్ లకు, చర్యలకు సంబంధిత మంత్రులకు వివరణలు సచివాలయ శాఖలు తయారు చేస్తారు. చట్టాలు రూపొందించాలంటే బిల్లులను న్యాయశాఖ తయారుచేసి మంత్రిమండలి ఆమోదం పొందాలి. ఆ తర్వాతే శాసన సభ ముందుంచుతారు. శాసన సభ అనుమతి పొంది చట్టమవుతుంది. సభ సమావేశాలలో లేనప్పుడు అర్జంట్ శాసనం చేయవలసి వస్తే 'ఆర్డినెన్స్' జారీ చేసి ఆ తర్వాత శాసనసభ ఆమోదం పొందవచ్చు.

ఉద్యోగుల నియామకం ఇలా...

రాష్ట్ర సచివాలయంలో టైపిస్ట్ కం అసిస్టెంట్ పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమిస్తారు. సహాయ విభాగాధికారి పోస్టులు టైపిస్ట్ కం అసిస్టెంట్ నుండి పదోన్నతి ద్వారా, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమిస్తారు. వీరి ఎంపిక ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ కమీషన్ నిర్వహించే గ్రూప్ టూ పరీక్షలలో జరుగుతుంది. విభాగాధికారుల పోస్టులకు సహాయ విభాగాధికారుల నుండి పదోన్నతిపై నియమిస్తారు. అధికారులకు వ్యక్తిగత సహాయులుగా స్టెనోగ్రాఫర్లు ఉంటారు. జూనియర్ స్టెనో పదవులకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమిస్తారు. సీనియర్ స్టెనోలకు జూనియర్ స్టెనోల నుండి పదోన్నతి ద్వారా, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమిస్తారు. సీనియర్ స్టెనోలకు ఎస్.సి స్టెనోలు పదోన్నతి కాగా, ఎస్.సి స్టెనోలకు కార్యదర్శికి వ్యక్తిగత కార్యదర్శి పదోన్నతి. ప్రభుత్వ సహాయ కార్యదర్శి పోస్టులకు నియామకం విభాగాధికారుల, కార్యదర్శికి వ్యక్తిగత కార్యదర్శి నుండి పదోన్నతిపై జరుగుతుంది. ప్రభుత్వ సహాయ కార్యదర్శి నుండి నాన్‌కేడర్ ప్రభుత్వ ఉపకార్యదర్శి, ఆపైన ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి ఆపై ప్రభుత్వ అదనపు కార్యదర్శి పదోన్నతులు. కాగా ఆలిండియా సర్వీస్ అధికారులకు ప్రభుత్వ ఉప, సంయుక్త అదనపు కార్యదర్శుల పదవులు కేటాయిస్తారు. ఇవి కేడర్ పోస్టులు. ప్రభుత్వ కార్యదర్శి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి,

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నీ కేడర్ పోస్టులు. న్యాయశాఖ కార్యదర్శి నాన్ కేడర్ జిల్లా సెషన్స్ జడ్జిని న్యాయశాఖకు కార్యదర్శిగా నియమిస్తారు. అదేవిధంగా నీటి పారుదల శాఖలో సాంకేతిక సహాయ సహకారాలకు సూపరింటెండింగ్ ఇంజనీరు ప్రభుత్వ సంయుక్త కార్యదర్శిగా నియమిస్తారు.

సంఘీభావం ఎక్కువే

మన సచివాలయంలో ఆర్థిక న్యాయ శాఖలలో కలిసి ముప్ఫైరెండు శాఖలు. సుమారు ఆరు వందల విభాగాలు ఉన్నాయి. సుమారు ఐదు వేల ఉద్యోగులున్నారు. ఇతర ప్రభుత్వోద్యోగుల కంటే సంఘీభావం, సంఘబలం సచివాలయ ఉద్యోగులకు ఎక్కువ. నేరుగా ఉన్నతాధికారుల వద్ద, మంత్రుల వద్ద పని చేయడం వీరికి కలిసి వచ్చే అంశం. అన్ని కేడర్లకు సంఘాలున్నాయి. సచివాలయ సాంస్కృతిక సంఘం, ఉద్యోగినుల సంక్షేమ సంఘం వున్నాయి. సచివాలయ సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు బాగా ప్రాచుర్యం పొందేయి.

ఒకసారి సచివాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తూ నాటి ముఖ్యమంత్రిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రసంగించడానికి వీలుగా సంఘ కార్యకలాపాలను వివరిస్తూ నిర్వాహకులు ఒక కాగితాన్ని రాసి ఇచ్చారు. ముఖ్యమంత్రి ఈ కాగితాన్ని పక్కన పెట్టి వీర్రాజుగారిని చూడాలని అడిగి... ఆయన రాగానే ఆయన నటించిన అలెగ్జాండర్ నాటకం చూశానని తాను వీర్రాజు గారి అభిమానినని చెప్పుకొచ్చేరట. ఆ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గారు.. సచివాలయంలో ఇప్పటికీ దీనిని ఒక తీపిజ్ఞాపకంగా నెమరేసుకుంటారు. కొత్త వాళ్లకు చెప్తుంటారు. సచివాలయ సంఘం, ఉద్యోగినుల సంఘం తరచూ ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తుంటాయి. సచివాలయ ఆవరణలో ఆరోగ్య కేంద్రం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, ఆంధ్రాబ్యాంకు క్యాంటీన్లు ఉద్యోగులకు అందుబాటులో ఉన్నాయి. ఇవి ఉద్యోగులకే కాక సచివాలయానికి పనుల మీద వచ్చే సందర్శకులకు కూడా ఉపయోగకరంగా ఉంటాయి. ఉద్యోగుల సహకార పరపతి సంఘం, ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంస్థ సచివాలయ ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, గృహావసరాలను తీర్చే ప్రయత్నం చేస్తున్నాయి.

గానుగెద్దు జీవితం

అన్నిటికన్నా శోచనీయమైన పరిస్థితి ప్రభుత్వ ఉపకార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు తమకు నియమాల ప్రకారం సంక్రమించిన బాధ్యతను వినియోగించక పోవడం. గతంలో వారి ఆమోదంతో విధాన నిర్ణయాలు లేని వివిధ అంశాలపై నివృత్తికి సంబంధించిన ఉత్తర్వుల వంటివి (క్లారిఫికేషన్లు) జారీ అవుతూ ఉండేవి. కానీ ప్రస్తుతం అతి సామాన్యమైన ఉత్తర్వులు కూడా ప్రభుత్వ కార్యదర్శుల స్థాయి నుండే జరుగుతున్నాయి. శాఖాధిపతులతో సంప్రదింపులు కూడా ప్రభుత్వ కార్యదర్శుల స్థాయిలోనే. 'మనకెందుకులే పైవాడు చూసుకుంటాడు' అనే ధోరణి ఎక్కువగా కనిపిస్తోంది. గానుగెద్దు జీవితానికి సచివాలయంలో ఉద్యోగం పెద్ద ప్రతీక. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చేసే పని ఏమిటంటే కొండను తవ్వి ఎలుకను పట్టడమే. ఇక్కడ చేసిన పనికి ఫలితం ఎక్కడో. వరండాలో స్విచ్ వేస్తే పెరట్లో లైట్ వెలిగినట్లు. అందుచేత లభించే తృప్తి బాగా తక్కువ.

సచివాలయ ఉద్యోగుల సహకార పరపతి సంఘం అర్బన్ బ్యాంకుల దివాళాతో ఆర్థిక సంక్షోభంలో పడింది. దాంతో చిన్నా చితకా అప్పులకు ద్వారం మూసివేశారు. ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంస్థల సేకరణలో కృతకృత్యులైనప్పటికీ నెక్కంపూర్ స్థల వివాదం, అంతర్గత కలహాలు కొత్త సమస్యలు సృష్టిస్తున్నాయి. జంటనగరాలలోని ఇతర ఉద్యోగులతో పాటు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న మరొక సమస్య జఠిలంగా మారిన రవాణా సమస్య. నగరానికి దూరంగా కాలనీలు, ట్రాఫిక్ జాంలతో సకాలానికి కార్యాలయం చేరడానికి ఉద్యోగులు పడేపాట్లు. సకాలానికి చేరని ఉద్యోగులను ఎండగడుతూ అప్పుడప్పుడు మీడియాలో న్యూస్.

రాజకీయ వత్తిడులు, పైఅధికారుల అదిలింపులు, బెదిరింపులు (బాసిజం) సచివాలయంలో తక్కువే. ఒకరిద్దరి వద్ద సమస్యలు ఎదురైనా వారి బారి నుండి తప్పించుకునే అవకాశాలు ఎక్కువే.. భద్రత అధికమే. వృత్తి రీత్యా లభించే తృప్తి కోసం ఎదురుచూడని వారికి వత్తిడులు వద్దనుకునే వారికి సచివాలయంలో ఉద్యోగం బాగా సరిపోతుంది.

ఇదీ సచివాలయం కథాకమామిషు!

★

పీత కష్టాలు పీతవి!

బయటనుంచి చూసే వారికి సచివాలయంలో పని చేయడం గొప్ప అనే భావన ఉండొచ్చు. కొండకచో ఇతర ప్రభుత్వ ఉద్యోగులు ఈ విధంగా భావించడం పరిపాటి. ఇది నాణానికి ఒక పార్శ్వం. మరో పార్శ్వం సచివాలయ ఉద్యోగుల కష్టాలు. వెతలు. ఇటీవల కాలంలో టైపిస్ట్ కం అసిస్టెంట్ పదవులకు నియామకాలు లేవు. సహాయ విభాగాధికారుల నియామకాలు సకాలంలో జరగడం లేదు. కింది స్థాయిలో ఖాళీలు సక్రమంగా భర్తీ కావడం లేదు. దానితో ఉన్న వారిపై పని భారం పెరుగుతోంది. పదోన్నతి పొందిన తరువాత కూడా కింది స్థాయిలో చేసిన పనితోపాటు అదనంగా పర్యవేక్షణ భారం తోడవుతోంది. ఉదాహరణకు టైపిస్ట్ అసిస్టెంట్ నుండి సహాయ విభాగాధికారిగా పదోన్నతి పొంది పదోన్నతి పొందిన పదవీ బాధ్యతతో పాటు ఖాళీ అయిన టైపిస్ట్ అసిస్టెంట్ పోస్టు భర్తీ కాకపోడంతో రెండు విధులనూ నిర్వహించవలసి వస్తోంది. విభాగాధికారి పరిస్థితీ అంతే! చాలామంది విభాగాధికారులు కూడా కంప్యూటర్ల ముందు కూర్చొని పని చేయడం గమనించవచ్చు. మరొక తీవ్రమైన సమస్య పదోన్నతులలో జాప్యం. ఒక టైపిస్ట్ కం అసిస్టెంట్ కి సహాయ విభాగాధికారిగా పదోన్నతి పొందడానికి కనీసం ఐదారు సంవత్సరాలు పడుతోంది. ఆపై విభాగాధికారి కావడానికి పదిహేను సంవత్సరాలు పడుతుంది. అంటే ఒక ఉద్యోగి ముప్పై సంవత్సరాలు సర్వీసు చేస్తే రెండొంతుల సర్వీసు నాన్ గజిటెడ్ కేటగిరీలో గడపాలి. కొన్ని ప్రభుత్వోద్యోగాలతో పోల్చి చూస్తే ఇది బాగానే ఉన్నట్లు కనిపించినా పరిస్థితి చాలా నిరుత్సాహంగానే ఉంది. అదీకాక వివిధ కేటగిరీల మధ్య సీనియారిటీ కుమ్ములాటలు రిటైర్మెంట్ అంచులో ఉన్నవారి పదోన్నతి అవకాశాలను మృగ్యం చేస్తున్నాయి. ఒకవైపు ఉన్నత పదవులలో ఖాళీలు మరొకవైపు అర్హులై రిటైర్మెంట్‌కు చేరువై పదోన్నతి కోసం ఎదురుతెన్నులు. ఎంత బాధాకరమైన విషయం!

దాదాపు ముప్పై సంవత్సాల క్రితం బి.ఎన్. రామన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కాలంలో ప్రభుత్వ సహాయ కార్యదర్శి పదవికి కార్యదర్శి వ్యక్తిగత కార్యదర్శుల, విభాగాధికారుల మధ్య నిష్పత్తి విధిస్తూ జారీ అయిన ఉత్తర్వుల చిచ్చు ఇంకా రగులుతూనే ఉంది. ఈ సమస్య సుప్రీంకోర్టు దాకా వెళ్ళింది. తీర్పు అమలు చేస్తూ జారీ అయిన ఉత్తర్వులు స్టెనోగ్రాఫర్, సహాయ విభాగాధికారుల మధ్య అగాధాన్ని పెంచేయి. డైరెక్ట్ రిక్రూట్ వర్సస్ ప్రమోటీస్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. పదోన్నతులలో జాప్యం తగ్గించడానికి కొన్ని కింది స్థాయి పదవులను అప్ గ్రేడ్ చేస్తే ఫీడర్ ప్రమోషన్ పదవుల మధ్య సమతౌల్యం దెబ్బతింది. కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి. పదోన్నతి పొంది కూడా కిందిస్థాయి పదవీ బాధ్యతలతో పాటు పైపదవీ బాధ్యతలను నిర్వహించడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కొంతవరకూ స్వయంకృతం కూడా ఉంది. దీర్ఘకాలిక ప్రయోజనాలను విస్మరించి తాత్కాలిక ఉపశమనం కోసం కోరిన కోరికలు భస్మాసుర వరాన్ని జ్ఞప్తికి తెస్తాయి. ఈ ఉత్తర్వుల ద్వారా కొంతమందికి బాగా లాభం కలిగితే చాలామందికి మనస్తాపం కలుగుతోంది.

తోటకూర పులుసు

కావలసిన వస్తువులు

తోటకూర - 4 కట్టలు, చింతపండు - నిమ్మకాయంత,
వెల్లుల్లిపాయ - 3 రెబ్బలు, ఎండు మిర్చి - 2,
నూనె - 1 గరిటె, కారం - చిన్న స్పూను,
ఉల్లిపాయలు - 3 పెద్దవి, మెంతులు - 2 టీ స్పూన్లు,
పచ్చిమిర్చి -3, ఉప్పు - తగినంత,
పోపు సామాన్లు - 1 టేబుల్ స్పూను, కరివేపాకు - 2 రెమ్మలు

తయారు చేయు విధానం

తోటకూర, ఉల్లిపాయలు సన్నగా తరిగి పెట్టుకోవాలి. స్టౌమీద బాండీలో మెంతులు దోరగా, మంచి వాసన వచ్చే వరకు వేయించాలి. తర్వాత ఒక గిన్నెలో తోటకూర, ఉల్లిపాయ ముక్కలు, చింతపండు, వెల్లుల్లి రెబ్బలు, కారం, కరివేపాకు వేసి కొద్దిగా నీళ్లు కూడా పోసుకుని ఉడకబెట్టుకోవాలి. తర్వాత దానిలో ఉప్పు వేసి మెదిపి పోపు పెట్టుకుంటే చాలా రుచిగా వుంటుంది. ఇష్టపడేవాళ్లు తోటకూర ఉడకబెట్టేటప్పుడే పచ్చిశనగపప్పు కూడా వేసుకోవచ్చు.

పచ్చిపులుసు

కావలసిన వస్తువులు

చింతపండు - పెద్ద నిమ్మకాయంత
ఉల్లిపాయ -1 పెద్దది
బెల్లం - నిమ్మకాయంత
పచ్చిమిర్చి - 2
కరివేపాకు - 2 రెమ్మలు
ఉప్పు - సరిపడా

తయారు చేయు విధానం

చింతపండును చిక్కగా కాకుండా మరీ పలుచగా కాకుండా పులుసులా చేసుకొని గిన్నెలో పోసుకోవాలి. పచ్చిమిరపకాయల్ని వేయించి చిదిమి పులుసులో వేసుకోవాలి. అందులోనే ఉప్పు, బెల్లం, ఉల్లిపాయ ముక్కలు వేసి బెల్లం కరిగే వరకు కలుపుకుంటే చాలు పచ్చి పులుసు తయారైనట్టే.



మజ్జిగ పులుసు

కావలసిన వస్తువులు

చిక్కని మజ్జిగ - అర లీటరు
సెనగ పిండి లేక బియ్యం పిండి - ఒక గరిటె
పచ్చిమిర్చి - 4, ఉల్లిపాయ - 1 పెద్దది
పసుపు - చిటికెడు, ఉప్పు - సరిపడా
పోపు సామాను - 1టీ స్పూను
కరివేపాకు - 2 రెమ్మలు

తయారు చేయు విధానం

మజ్జిగలో బియ్యంపిండి లేక సెనగపిండి వుండలు లేకుండా కలిపి స్టౌ మీద పెట్టాలి. అందులోనే పసుపు, పచ్చిమిర్చి చీలికలు, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి కలియదిప్పి మూత పెట్టాలి. చిన్న మూకుడులో పోపు వేసుకుని మజ్జిగలో కలుపుకుంటే సరి. అయితే ఉల్లిపాయ ముక్కలు మరీ మగ్గకుండా ఉంటే బావుంటాయి. శనగపిండి లేక బియ్యం పిండి ఇష్టమైతేనే వేసుకోవచ్చు.

పెరుగు గారె

కావలసిన వస్తువులు

పెరుగు - అర లీటరు
మినపప్పు - పావుకిలో
పచ్చి మిర్చి - 6
అల్లం - అంగుళం ముక్క
ఉప్పు - తగినంత
కరివేపాకు - 5 రెమ్మలు
పోపు సామాను - 2 టేబుల్ స్పూన్లు
నూనె - అర కిలో

తయారు చేయు విధానం

మామూలు గారెలకు నానబెట్టినట్టే మినపప్పు నానబెట్టి శుభ్రంగా కడిగి అందులో కొద్దిగా ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి.

పెరుగు గట్టిగా ఉంటే కొద్దిగా నీళ్లు గానీ మజ్జిగ గానీ కలిపి పల్చగా చేసుకోవాలి. అల్లం, పచ్చిమిర్చి, ఉప్పు, కరివేపాకు మెత్తగా నూరి ఈ మజ్జిగలో కలిపి పోపు పెట్టుకోవాలి.

బాండీలో నూనె వేసి బాగా కాగిన తర్వాత రుబ్బి పెట్టుకున్న పిండిని గారెల్లా చేసుకుని పక్కనే పెట్టుకున్న పోపు వేసిన పెరుగులో వేసుకోవాలి. ఈ గారెలు పెరుగులో కొద్దిగా నానిన తర్వాత తింటే చాలా బావుంటాయి.

చూద్దామా


బారా ఇమాంబారాలోపలి భాగం

గోమతీ నదీ తీరాన నిర్మించిన నగరం **లక్నో** ఈ అవధ్ ప్రాంతపు రాజధాని. సుదీర్ఘ చరిత్రకూ, ఉత్తమ సంస్కారానికి పట్టుకొమ్మ. ఢిల్లీ పతనావస్థకు చేరుకున్న రోజుల్లో కూడా ఇది వైభవోపేతంగా విరాజిల్లింది. ఒకనాటి వైభవానికి చిహ్నాలుగా నిలిచిన కట్టడాలూ, ప్రదేశాలూ ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ఈ వారం మీకోసం ప్రత్యేకంగా...

ప్రాచీనతా నవీనతా కలబోత

ఇమాంబారా అంటే మూల పురుషుని మహల్ అని అర్థం. ఇలా పిలవడం అవధ్ వారి సాంప్రదాయం. ఇక్కడో చిత్రమైన కథ వుంది. 18వ శతాబ్దంలో ఇక్కడ కరువు కాటకాలు చెలరేగితే, దీని నుండి ప్రజలను కాపాడటానికి, వారికి ఏదో ఒక పని కల్పించి, జీత భత్యాలిచ్చి, ఆదుకోవడానికి ఈ కట్టడం తలపెట్టాడు నవాబ్ అసఫ్ ఉద్దౌలా. కైఫీయత్ ఉల్లా అనే వ్యక్తి ఈ పథకానికి రూపకల్పన చేశాడు. ఆ రోజుల్లోనే కోటి రూపాయలు ఖర్చు చేశారట. ఇది చాలా పెద్ద కట్టడం. రెండు ప్రాకారలు దాటి లోపలకు వెళ్లాలి. ఈ రెండింటి మధ్య చక్కని లాన్సు ఏర్పాటు చేశారు. చాలా ఎత్తయిన బేస్‌మెంట్ మీద 303 అడుగుల పొడవు, 163 అడుగుల ఎత్తున్న ఈ కట్టడంలో ఎక్కడా కలప, ఇనుము ఉపయోగించలేదు. కేవలం ఇటుకలు, సున్నంతోనే కట్టారంటే ఆ నిర్మాణ చాతుర్యం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీనిలో సెంట్రల్ హాల్ 163 అడుగుల పొడవు 53 అడుగుల వెడల్పు కలిగి ఆసియాలోకెల్లా పెద్ద హాలుగా పేరు తెచ్చుకుంది. ఈ హాలు మధ్యలో నవాబుగారి సమాధిపై ముఖమల్ వస్త్రం కప్పి ఉంటుంది.

ఈ హాలు చుట్టూ మూడు అంతస్థుల కట్టడం వుంది. దీని నిర్మాణం కూడా అద్భుతంగా వుంటుంది. రెండవ, మూడవ అంతస్థులు అగమ్యగోచరమైన మార్గాలతో గజిబిజిగా వుంటాయి. అందుకే దీన్ని "భూల్ భులన్ ఇన్" అంటారు. అంటే 'నిన్ను నీవు కోల్పోతావు' అని అర్థం. బయటకు వెళ్లాలని బయలుదేరితే, తిరిగి తిరిగి లోపలకు వస్తాము. కిందికి వెళ్లాలని మెట్లు దిగితే, పైఅంతస్థుకు చేరుకుంటాం. ఇంత చిత్రంగా మలచిన ఇంత విస్తారమైన కట్టడంలోనికి గైడు లేకుండా వెళితే ఏమైపోతామోనని పిస్తుంది. మరో


బారా ఇమాంబారా

చిత్రమేమిటంటే, ఒక గోడ నుంచి మరో గోడకు శబ్ద తరంగాలు ప్రవహిస్తాయి. ఒక గోడ దగ్గర చిన్నగా మాట్లాడితే, అవతలి గోడ వద్ద చెవిపెట్టి వినవచ్చు. సెంట్రల్ హాలులో ఒక పక్క నిలబడి ఒక కాగితం చింపితే, ఆ శబ్దం అవతలి పక్క 163 అడుగుల దూరానున్న వారికి స్పష్టంగా వినిపిస్తుంది. దీనికి వందలాది కిటికీలున్నాయి. వీటికి సమాంతరంగా బయటి ప్రాకారాలకు కూడా కిటికీలు అమర్చారు. అంటే ఏ ఒక్క కిటికీ నుండయినా నేరుగా వెలుపలకు చూడవచ్చు. ఈ ఏర్పాట్లన్నీ ఎత్తునుండి చాలా దూరం వరకూ శత్రువుల ఉనికిని గమనించడానికి, ఆ సమాచారం గోడల ద్వారా నిర్ణీత శబ్దాలతో భవనంలో అందరికీ అందించడానికీ చేశారన్నమాట. పొరపాటున శత్రువులు ఇందులోకి ప్రవేశించారా, ఇక అలా తిరుగుతూ వుండవలసిందే! ఈ లోపు మాటువేసి వారిని హతమార్చవచ్చు. అప్పటి రక్షణ వ్యవస్థలో ఇదికూడా ఒక భాగమే. అయితే రెండవ, మూడవ అంతస్థుల్లో నిర్ణీత దూరాల్లో కూడళ్ళు ఉన్నాయి. మనం నడుస్తున్న మార్గం ఈ కూడలి వద్దకు రాగానే నాలుగు దారులుగా విడిపోయి ఒక్కో దారి ఒక్కో పైపుకు వెళుతుంది. వాటిలో మూడు మార్గాలు మనల్ని తప్పుదారి పట్టిస్తాయి. ఒక్కటి మాత్రమే సరైన గమ్యం వైపుకు వెళ్తుంది. అంతే కాకుండా ఆ నాలుగు దారుల్లో రెండు సమాంతరంగానూ, మూడవది పైఅంతస్థుకు వెళ్లే మెట్లవైపు, నాలుగవది కిందికి వెళ్లే మెట్లతోనూ కలుస్తాయి. మనం కిందికి వెళ్లాలంటే కూడళ్ల వద్ద


ఛోటా ఇమాంబరా


రెసిడెన్సీ


బారా ఇమాంబరా మెట్లదారి

పైకివెళ్లే మెట్లు ఎక్కితే కిందికి వచ్చేస్తాం. అలాగే పైకి వెళ్లాలంటే కిందికి వెళ్లే మెట్ల గుండా వెళ్తేసరి. ఈ విషయం తెలుసుకోకపోతే కూడళ్లవద్ద పొరపాటు జరిగిందంటే ఇక ఎన్ని ఏళ్లయినా సరే ఇక్కడే తిరుగుతుండవలసిందే. ఇంతటి అద్భుతమైన కట్టడానికి రక్షణ కరువైంది. అక్కడ గైడ్లు తప్ప మరెవరూ వుండరు. లక్నోలోనే మరో ప్రదేశంలో ఉన్న ఛోటా ఇమాంబరా అనే చిన్న కట్టడం కూడా ఇటువంటిదే.

లక్నోలో బాగా జరిగే పండుగ మొహరం. కర్బలాలో ఉన్న సమాధి నమూనాలు, నవాబుల కాలంలోని తాజియాలు, బంగారం, వెండితో చేసినవి ఊరేగింపుతో తెస్తూ, సంతాప సూచికంగా వేలాది ముస్లింలు రక్తం చిమ్మేటట్లు గుండెలు బాదుకుంటూ పురవీధుల్లోకి వస్తారు. ఆ సమయంలో బారా ఇమాంబారా, ఛోటా ఇమాంబారాని కూడా విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. అదే సందర్భంలో మండే నిప్పులమీద నడవటం కూడా జరుగుతుంది. వివిధ ప్రాంతాలనుండి వచ్చిన తాజియాలన్నీ, పదవరోజున సమాధి చేసి అందరూ ఒకచోట సమావేశమౌతారు. దీన్ని "మజ్లిస్ షమ్ ఇషురిబన్" అంటారు. అప్పటి ఆత్మార్పణనూ, దుఃఖావేశాన్ని ఈ పండుగ నాడు గుర్తుచేసుకుంటారు.

షహీద్ స్మారక్

1857 సిపాయి తిరుగుబాటులో (మొదటి స్వాతంత్ర్య పోరాటం) లక్నో ప్రముఖ పాత్ర వహించింది. గోమతీ నది అవతలి ఒడ్డున ఉన్న మలియాల్ కంటోన్మెంటుకు చెందిన సిపాయిలు తిరుగుబాటు చేశారు. 1857 జూన్ 30వ తేదీ నుండి 140 రోజుల పాటు ఇక్కడి బ్రిటీషు అధికార పీఠమైన రెసిడెన్సీని ముట్టడించారు. ఈ పోరులో 2015 మంది మృతి చెందారు. భారతదేశంలో రగులుతున్న స్వాతంత్ర్యకాంక్ష, బ్రిటీష్ పాలనలో వారికెదురౌతున్న అవమానాలకు ప్రతీకార జ్వాలలు ఒక్కసారిగా ఉవ్వెత్తున లేచాయి. ఒక్క రెసిడెన్సీలోనే 2000 మంది బ్రిటీష్ వారిని చంపేశారట. స్వాతంత్ర్య సమరానికి ప్రథమ శంఖం పూరించి, శత్రువును తుద ముట్టించి, దేశమాత శృంఖలాలను ఛేదించటానికి తమ ప్రాణాలర్పించిన వారికి స్మృతిచిహ్నంగా ఈ షహీద్ (దేశభక్తుల) స్మారక్ నిర్మించారు. సమున్నతంగా పాలరాతితో నిర్మించిన ఈ కట్టడం చుట్టూ ఏనుగులను మలచి ఎంతో అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రమైతే లాన్ల మధ్య

షేప్ రైఫిల్స్ కాలనీలో గంభీరంగా నిలిచివున్న ఈ స్మారక చిహ్నం స్వాతంత్ర్యమనేది ప్రాణాలకంటే మధురమైనదని మనకు గుర్తు చేస్తూంటుంది.

రెసిడెన్సీ

ఇది బ్రిటీష్ వారి అధికార పీఠం. ఒకనాటి తన ఔన్నత్యాన్నీ, ఈనాటి దీనత్వాన్నీ కలబోసుకుని మన వంక చూస్తున్నట్లు వుంటుంది. గోడలు చాలా భాగం మసిబూసుకుని వున్నాయి. "పొగచూరిన శాసనాల జాడలు" గుర్తొస్తాయి.

గోమతీ తీరాన ఎత్తయిన గుట్టమీద దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో సకల సదుపాయాలతో దీనిని నిర్మించారు. ఇప్పుడు వీలైనంత మేరకు లాన్సువేసి ఈ చారిత్రక చిహ్నాన్ని పరిరక్షిస్తున్నారు. ఆనాడు స్త్రీల కొరకు మధ్యలో ఓ కట్టడం, దాని చుట్టూ పెద్ద భవనాలు ఉన్నాయి. వీటిలో ఒకటి ఆర్మీ బారక్సు అని మనం గుర్తించవచ్చు. రెండతస్తులలో వున్న దీని పైభాగం, గోడలు శిథిలమైపోయాయి. మరో పక్క రోమన్ వాస్తురీతిలో నిర్మించిన పరిశుభ్రమైన కట్టడం వుంది. బహుశా బ్రిటీష్ రెసిడెంటు నివాసమైవుండాలి. మిగిలిన ప్రదేశమంతా వందలాది సమాధులున్నాయి. వీటికి పాలరాతి మీద ఇంగ్లీషు, లాటిన్ భాషలలో చెక్కిన పలకలు అమర్చారు. ఇవి నిహతులైన బ్రిటీష్ ప్రముఖుల సమాధులు.

రెసిడెన్సీలో ఆనాటి పోరాటంలో పొగచూరిన శిథిలమైన ఎత్తైన గోడలు, అక్కడక్కడా పడున్న ఫిరంగులు, ఆనాడు మొలకెత్తిన మర్రి చెట్లు ఇప్పుడు మహావృక్షాలై, ఆనాటి జీవన్మరణ సంఘర్షణకు సాక్షులుగా దర్శనమిస్తాయి. ఒక విషాద రేఖ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. నిర్జీవమైన గోడలూ, వాటినలుముకున్న మసి తీవ్రమైన వేదనను విరజిమ్మగలదని వాటిని చూస్తే అర్థమౌతుంది.



ధవళ వర్ణపు నెమలి

లక్నో జంతు ప్రదర్శన శాల

ఇక్కడి జంతు ప్రదర్శన శాల చాలా పాతది. జంతువులు ఎక్కువగా లేకపోయినా లాన్సు, గార్డెన్, మ్యూజియం చక్కగా అమర్చారు. ఇక్కడ తెల్ల నెమళ్లు స్వచ్ఛమైన ధవళ వర్ణపు శోభతో ఎంతో అందంగా ఉంటాయి. నెమలి ఈకల్లోని కన్నులు కూడా తెలుపులోనే తెలుపు. ఎక్కడా మరో రంగు లేకుండా తెల్లగా వెన్నెల ముద్దలా వుంటాయి.

పురాతన నగరం

లక్నో నిండా చారిత్రక కట్టడాలే. ముఖ్యంగా ఇప్పుడు పాత నగరంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్ దగ్గర రెండు అందమైన కట్టడాలు చిన్న గుట్టల మీద నిర్మించి వున్నాయి. చుట్టూ అందమైన లాన్సు. వీటిలో ఒకటి సాదత్ అలీఖాన్ సమాధి. రెండవది ఆయన భార్య బేగం సాహెబాది.

షాపింగ్ కోసం...

ఓల్డ్ సిటీలోని హజరత్ గంజ్ మార్కెట్ చాలా విలాసవంతంగా వుంటుంది. బ్రిటీష్‌వారి కాలంలో ఇది వారికే ప్రత్యేకం. దేశీయులకు ప్రవేశం లేదు. ఇప్పటికీ దీని అరిస్టోక్రసీ అలాగే వుంది. లక్నో చికన్ అనే బట్టలు చాలా ప్రసిద్ధికెక్కాయి. బట్టల మీద దారంతో రకరకాల పూలు, లతలూ కుట్టి ఎంతో అందంగా వుంటాయి. ఇక్కడ ఒక్కో బజారుకు ఒక్కో రోజు సెలవుదినం ఉంటుంది. ఇలా ప్రతిరోజు ఏదో ఒక బజారైనా తెరిచి వుంటుంది. డబ్బుండాలే కానీ ఎంత షాపింగైనా చేసుకోవచ్చు. ప్రాచీన నగరమైన లక్నో మన దేశంలోకెల్లా అతి పెద్ద రాష్ట్రానికి రాజధాని. ఢిల్లీ పతనం తర్వాత కూడా ఆ వైభవం ముఖ్యంగా ఉర్దూ భాష మాధుర్యం ఇక్కడ పురులు విప్పింది. ఇవన్నీ గతంలోనివి. ప్రస్తుతానికి లక్నో ప్రాచీనతా, నవీనతా కలబోసుకున్న మహా నగరం.

★



షహీద్ స్మారక్

క్రైమ్ కథ

మేకవన్నె పులి

- యర్నాగుల సుధాకరరావు

"రాజేశ్‌ని పట్టణంలో ఒక లాడ్జిలో చంపేశారెవరో! అతడు నివసించే గ్రామంలో శత్రువులు ఎవరూ లేరు. కొత్తగా రాజకీయాల్లోకి చేరి ముమ్మరంగా జనాలమధ్య తిరుగుతున్నాడు. ఉన్నంతలో అందరితో కలిసిపోయే రకం. మరి ఎవరు ఎందుకు చంపారో అర్థంకావడంలేదు.రాజేశ్ హత్య జరిగాక మూడునెలలు గడిచిపోయినా మన డిపార్టుమెంటు ఒకచిన్నపాటి క్లూ సంపాదించలేకపోయింది" డిటెక్టివ్ జ్యోతి స్వరూప్‌కు చెప్పి నొసలు నొక్కుకున్నాడు పోలీసు ఉన్నతాధికారి.

టేబిల్‌మీద రాజేశ్ హత్యకు సంబంధించిన ఫైలు అందుకుని తిరగేశాడు. "స్వరూప్ మీరే పరిశోధించండి. మీకు తెలుసు పోలీసులకు నిత్యం అదనంగా అనేక బాధ్యతలు వచ్చిపడుతునే ఉన్నాయి. ఏఒక్క ఆఫీసర్ ప్రశాంతంగా లేనేలేడు. మరి తలపెట్టి చేస్తే కదా ఇలాంటి హత్యల్లో హంతకుడిని పట్టుకునేది, చట్టం ముందు నిలిపేది" చెప్పి ఆ అధికారి ఆగదిలోంచి వెళ్లిపోయాడు. ఒంటరిగా కూర్చుని ఫైలులో కాగితాలను చదివి సీలింగ్‌వైపు చూశాడు.

ఎలాంటి ఆధారాలు ఆఫైలులో లేవు. లాడ్జి గదిలో మద్యం మత్తులో ఉన్న రాజేశ్‌ను పదిపన్నెండు కత్తిపోట్లుతో చంపేశాడు హంతకుడు. ఆగదిలో కనీసం హంతకుడి వేలిముద్ర కూడా లేకుండా జాగ్రత్త పడ్డాడు. చిన్న ఆధారం సైతం దొరకనేలేదు. గ్రామానికి వెళ్లాడు. అక్కడ పోలీసు వ్యాన్ చూడగానే జనాలు చేరారు. ఒకరకంగా నిలదీశారు. "రాజేశ్ హత్యను ఇంకెన్నాళ్లు మీరు కాలయాపనలో పెట్టి అడపాతడపా ఇలా వచ్చి అడిగినదే అడుగుతారు" అని మీదపడిపోయారు.

స్వరూప్‌తో వచ్చిన పోలీసులు విసుగ్గా చూశారు.

"ఇలా నిలదీయడం కాదు. మీరు మీవంతు సహకరించాలి. రాజేశ్‌కు ఇక్కడ ఎవరూ శత్రువులు లేరు. అతడు మంచివాడేనని చెబుతున్నారు. ఇలా అయితే కేసు నత్త నడక నడుస్తుంది. బాగా ఆలోచించి చెప్పండి అతడికి ఎవరి వలనో ప్రాణాపాయం ఉందని మీకు తెలుసు. మీరు పెదవి విప్పడం లేదు" స్వరూప్ చిరుకోపంతో వారిని ఎదురు ప్రశ్నించాడు.

నిలదీసిన వారిలో ఒకడు ముందుకువచ్చి "అయ్యా మాటకు మాట అనుకోవడం ఎందుకు? మాకు పెద్దగా ఉంటూ మాక్షేమం చూసే రాజేశ్ హత్యకు గురవడంతో అంతా చేష్టలుడిగిఉన్నాం. చంపిందెవరో తెలుసుకోవాలని ఆరాటపడుతున్నాం. అతడు అజాతశత్రువు. ఎవరితోనూ ఎలాంటి గొడవపడే రకం కాదు. ఇక చంపిందొకడైతే మీ పోలీసులు మరొకడిని పట్టుకుని కోర్టు బోనులో నిలుపుతారంట. రాజేశ్ వద్ద నమ్మకమైన పనివాడినని నేనే చంపేశానని నామీద నింద మోపి కోర్టు బోను ఎక్కించేయండి. మీపని అయిపోతుంది. మాకు 'ఎవరు చంపారా?' అని టెన్షన్ పోతుంది. నాకు రాజేశ్ లేని గ్రామంలో

"నా చెల్లెలు భోజనం తీసుకుని రైస్‌మిల్లుకు వచ్చేది. నేను లేనప్పుడు రాజేశ్ తనను తేలిగ్గా బుట్టలో వేసుకుని అనుభవించాడు. రాజేశ్‌ను పెళ్లి చేసుకోమని అడిగిందామె. రాజేశ్ కాదు పొమ్మన్నాడు. దాంతో నూతిలో పడి చనిపోయింది. ఈ కథనం నాకు నాచెల్లెలు చనిపోయాక తెలిసింది. ఈలోగా నన్ను నమ్మించడానికి ఫకీరును తెచ్చి నాముందు వాడిని చావ గొట్టినట్టు నటించి వాడికి గ్రామ బహిష్కారం చేశాడు.

ఏపని చేయాలని అనిపించడంలేదు. జైలులో నాలుగు గోడల మధ్య గడిచిపోతుంది" కన్నీళ్లతో ఉద్వేగంగా చెప్పాడు గ్రామీణుడు చంద్రం.

ఆమాటలకు అక్కడి వారంతా ఆశ్చర్యపోయినా పోలీసులు తీక్షణంగా చూశారు. "ఏయ్ పోలీసు కేసులంటే నీకు డమ్మీ కేసుల్లా కన్పిస్తున్నాయా?" అని ఒక కానిస్టేబుల్ మీదకు వెళ్లాడు. స్వరూప్ అతడిని వారించి "ఎందుకయ్యా నీమీద హత్యానేరం మోపమంటున్నావు. వంద మంది అపరాధులు తప్పించుకోవచ్చు కానీ ఒక నిరపరాధి శిక్షకు గురికా కూడదు" అని అతడిని సముదాయించాడు. గ్రామీణులు అతడిని అక్కణ్నించి పంపేశారు.

"ఇంతకీ రాజేశ్ వద్ద ఏమి చేసేవాడు?" స్వరూప్ అడిగాడు.

"అయ్యా ఈచంద్రం, రాజేశ్ రైస్‌మిల్లులో డ్రయివర్‌గా పనిచేసేవాడు. వాడికి ఒక చెల్లెలుండేది. చాలా మంచిపిల్ల. కానీ, ఎందుకో ఒకరోజు రైస్‌మిల్లు ఆవరణలో ఉన్న నూతిలో పడి ఆత్మహత్య చేసుకుంది. అప్పుడు పోలీసు కేసు లేకుండా శవాన్ని తీయించి దహనం చేయించాడు రాజేశ్. ఆతరువాత ఈఊళ్లో జులాయిగా తిరిగే ఫకీర్ ఈ ఆత్మహత్యకు కారకుడు అని పట్టుకుని చెట్టుకు కట్టి చావగొట్టాడు రాజేశ్. అందుకే రాజేశ్ అంటే చంద్రానికి ప్రాణం. రాజేశ్‌ను చంపిందెవరో తెలుసుకునేందుకు మా అందరికంటే ఎక్కువగా ఆత్రుత పడుతున్నాడు" చెప్పారు ఆఊరి జనాలు.

ఫకీరు గురించి మరిన్ని వివరాలు తెలుసుకుని అతడు గ్రామం నుంచి వెలివేయబడినందున పట్టణంలో ఉన్నట్టు తెలుసుకుని వెంటనే ఠాణాకు రప్పించి ప్రశ్నించాడు స్వరూప్. అతడు చెప్పిన విషయాలు విన్నాక స్వరూప్ ఆశ్చర్యపోయాడు. అసలు చంద్రం చెల్లెలికి నాకు ఎలాంటి సంబంధం లేదు.రాజేశ్ నాకు కొంత డబ్బిచ్చి ఊరు వదిలిపొమ్మని చెట్టుకు కట్టి తీవ్రంగా అతడు కొట్టినట్టుగా నన్ను నటించమన్నాడు. అందుకు నేను డబ్బు ఆశతో ఒప్పుకున్నాను.ఈమధ్య ఎవరో రాజేశ్‌ను చంపేశారు.అతడో మేకవన్నె పులి" అని చెప్పాడు.

"రాజేశ్ మంచివాడు అని గ్రామంలో ప్రతిఒక్కడు చెబుతుంటే నువ్వు విరుద్ధంగా చెబుతున్నావు. అతడిలో ఉన్న పులి గురించి చెప్పు"

"చంద్రానికి తెలుసు. వాడే రాజేశ్ చీకటిపనులకు ఎక్కువగా తోడుండేవాడు. రాజేశ్‌కు ఉన్న ఏకైక పిచ్చి అమ్మాయిల పిచ్చి. వాడే చంద్రం చెల్లెలి చావుకు కారకుడు. లేకుంటే నన్ను డబ్బిచ్చి ఒప్పుకోమంటే నేనే చంద్రం చెల్లెలిని ప్రేమలోకి దించేసి మోసం చేశాను అని చెప్పినపుడు అక్కడే ఉన్న చంద్రం ఏమీ అనలేదు. కనీసం నన్ను ఈసడించలేదు. అసలు నేరగాడు ఎవడో చంద్రానికి తెలుసు. నాకు తెలిసి రాజేశ్‌ను చంపింది చంద్రమే. రాజేశ్ కదలికలు తెలిసినవాడు చంద్రం.అందుకే తేలిగ్గా చంపేశాడు.ఇంతవరకు వాడిని ఎవరూ అనుమానించలేదు. కారణం రాజేశ్ శవంవద్ద వాడు పెడబొబ్బలుపెట్టి ఏడ్చిన దొంగేడుపులు అందరిని నమ్మించాయి"

స్వరూప్ వెంటనే చంద్రాన్ని ఠాణాకు రప్పించి ప్రశ్నించాడు. రెండురోజుల వరకు తనకు ఏమీ తెలియదు అని చెప్పిన వాడల్లా చివరికి ఒప్పుకోక తప్పలేదు. "నా చెల్లెలు భోజనం తీసుకుని రైస్‌మిల్లుకు వచ్చేది. నేను లేనప్పుడు రాజేశ్ తనను తేలిగ్గా బుట్టలో వేసుకుని అనుభవించాడు. రాజేశ్‌ను పెళ్లి చేసుకోమని అడిగిందామె. రాజేశ్ కాదు పొమ్మన్నాడు. దాంతో నూతిలో పడి చనిపోయింది. ఈ కథనం నాకు నాచెల్లెలు చనిపోయాక తెలిసింది. ఈలోగా నన్ను నమ్మించడానికి ఫకీరును తెచ్చి నాముందు వాడిని చావ గొట్టినట్టు నటించి వాడికి గ్రామ బహిష్కారం చేశాడు.నేను కొన్నాళ్లు మౌనం నటించి పట్టణంలో లాడ్జిలో దిగిన రాజేశ్‌ను తప్పతాగాక కత్తితో పొడిచి చంపేశాను" హత్య చేయడానికి గల కారణాన్ని తెలిపాడు.

★

కూల్‌కూల్‌గా...



మధురఫలం ద్రాక్ష

ఎండాకాలంలోనే కాకుండా ఏడాది పొడవునా దొరికే అద్భుతమైన పండు ద్రాక్ష. ఎప్పుడూ దొరికినా, ఎండాకాలంలోనే దాని ప్రత్యేకత! ముఖ్యంగా మన ప్రాంతాలలో వేసవిలోనే అధికంగా లభిస్తుంది. అసలు ద్రాక్ష పండు చరిత్ర ఏంటి? దాన్ని ఉపయోగించి ఏమేం తయారుచేస్తారు? కొనేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ద్రాక్షలో ఏమేం పోషకపదార్థాలు ఏ మోతాదులో వుంటాయి? వంటి వివరాలు ఈ వారం మీకోసం ...

- డా॥ కాకర్లమూడి విజయ్

ద్రాక్షపళ్లను శుభ్రంగా కడిగి తింటుంటే మహా ఆనందంగా వుంటుంది. పైగా చూడడానికి కూడా ద్రాక్షపళ్లు చాలా బావుంటాయి. ఒకప్పుడు చిన్నసైజు ఉసిరికాయంత పచ్చ ద్రాక్షలు వచ్చేవి. కాకపోతే వాటిలో గింజలుండేవి! ఏ పండులోనైనా గింజలుండాలి కదా అంటారా? అవును, వుండాలి. కానీ మెత్తని, తియ్యని గుజ్జు నోట్లో మధురంగా కరుగుతుంటే మధ్యలో పంటికింద రాయిలాగా గింజలు ఇబ్బంది కలిగించడం భరించలేం. అందుకే కాబోలు ఇప్పుడు అటువంటి గింజల ద్రాక్ష మచ్చుకైనా కనిపించకుండా పోయింది. మొత్తం 'సీడ్ లెస్' మయమైంది. గింజలు పోయినా, కొన్ని రకాలలో తోలు మందంగా ఉండి రుచిని కాస్త దెబ్బతీస్తుంది. చాలా మంది ఇంతకు ముందు ద్రాక్షపళ్లు తింటూ గింజల్ని బయటకు వూసేవాళ్లు – ఇప్పుడు తొక్కల్ని వూస్తున్నారు. అయినా వాటిని తింటేనే ఆరోగ్యానికి మంచిది.

ఆగండాగండి. పండ్ల తోలులో అనేక విలువైన పోషక పదార్థాలుండటం నిజమే. అయినా ఈ నాటి కృత్రిమ, రసాయనిక కీటక సంహారక మందులు రాజ్యమేలుతూ, పంటల్ని శాసిస్తున్న కాలంలో అటువంటి మందులు బాగా పట్టివుండే తోళ్లను తీసివేయడమే మంచిది.

ద్రాక్ష చరిత్ర చాలా పురాతనమైనది. క్రీస్తు పూర్వ కాలం నుండీ ఈ పండు వాడుకలో వున్నట్టు తెలుస్తోంది. ప్రాచీన ఈజిప్టులోనూ, గ్రీకులూ, రోమన్లూ కూడా ద్రాక్షను తినడానికీ, మధువు (ద్రాక్షరసం) తీయడానికీ వాడేవాళ్లు. ఇప్పుడు ద్రాక్షని జామ్‌లు, జెల్లీలు, ఎండబెట్టి 'కిస్‌మిస్'ల లాగా కూడా వాడుతున్నారు.

దాదాపు 7000 సంవత్సరాలకు పూర్వం పశ్చిమాసియా ప్రాంతంలో ద్రాక్ష సాగు జరిగేదని కొందరంటారు. ఇంకొందరు క్రీస్తుపూర్వం 2375 సంవత్సరంలో ఈజిప్టియన్ సమాధులలో ద్రాక్ష చిత్రాలు దొరికాయంటారు. అంతకంటే ముందే చైనాలో ద్రాక్షని పెంచేవాళ్లని ఇంకొందరంటారు. ద్రాక్ష ఎక్కడ పుట్టినా ప్రస్తుతం అది ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది.

ద్రాక్షని తినడంతో పాటు వైన్ (మధువు) తయారీలో వాడతారు. వైన్ తయారీ కూడా ద్రాక్ష అంతటి ప్రాచీనమైనదే. రోమన్లు, గ్రీకులు ద్రాక్షరసానికి దైవత్వాన్ని ఆపాదించారు. ఆ సామ్రాజ్యాలు కనుమరుగవ్వడంతో 'గాల్' ప్రాంతీయులు వైన్ తయారీ ప్రారంభించారు. ఫ్రెంచ్ వాళ్లు వైన్ తయారీని ఒక కళ స్థాయికి తీసుకెళ్లారు. ఇప్పటికీ అత్యున్నతమైన ద్రాక్షరసం ఫ్రెంచ్ వాళ్లు చేసినదే! ఈనాటికీ వైన్ కోసం పెంచే ద్రాక్షలు యూరప్‌వే.

ఆకుపచ్చ, లేతపచ్చ, బంగారురంగు, నీలం, నలుపు, వంగరంగు... ఇలా అనేక రంగులతో దాదాపు 50 వెరైటీలు ఇప్పుడు లభ్యమౌతున్నాయి. వాటిలో చాలా వరకు హైబ్రిడ్ రకాలే. అయితే వాస్తవానికి వేలాది రకాల ద్రాక్షలు వున్నాయి. వాటిలో 600 వరకూ ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి.

మన దేశంలోనూ ప్రాచీన కాలం నుండే ద్రాక్షసాగు, వాడకం వుండేదనటానికి ఆధారాలున్నాయి. క్రీస్తుపూర్వం 1356 - 1220



కొనేటప్పుడు జాగ్రత్తలు

⇨ ద్రాక్ష గుత్తిని విదిలిస్తే ద్రాక్షలు రాలకూడదు.

⇨ ద్రాక్షలు చెట్టు నుండి కోసిన తర్వాత పండవు(చాలా వరకు పండిన కాయల్నే కోస్తారు). కాబట్టి మగ్గిన కాయల్నే తీసుకోవాలి.

⇨ మరీ వడలినట్లున్న గుత్తిని తీసుకోవద్దు.

⇨ గుత్తి నుండి రాలిపోయిన ద్రాక్షలను ఈమధ్య భారీగా షాపుల్లో అమ్ముతున్నారు. అటువంటి వాటికి దూరంగా ఉండండి (ద్రాక్షకి, షాపులకు కాదు).

⇨ ద్రాక్షలకు మందులు ఎక్కువగా చల్లుతారు. కాబట్టి ఇంటికి తెచ్చిన వాటిని ఒక గంటపాటు చల్లని నీళ్లలో వుంచి ఆ తరువాత కడిగితినాలి.

⇨ ద్రాక్ష నిండా చెక్కర పదార్థాలు అధికం. కాబట్టి బ్యాక్టీరియా ఇట్టే ఆకర్షితమైతాయి. అందువల్ల బంకగా ఉండే కాయల్నీ, నీరుగారే కాయల్ని తినకూడదు.



మధ్యకాలంలోని శుశ్రూత సంహిత, చరకసంహితలో ద్రాక్ష ఔషధ గుణాల వివరణ వుంది. క్రీస్తుపూర్వం నాల్గవ శతాబ్దంలో కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రంలో ద్రాక్షసాగుకు అనువైన నేలల ప్రస్తావన ఉంది. అడవి రకాలను ఇంకా హిమాచల్ ప్రదేశ్‌లో పండిస్తున్నారు. కానీ అసలు అడవి రకాలు దాదాపు అంతరించిపోయినట్టే.



వందగ్రాముల ద్రాక్షలో పోషక పదార్థాలు

కార్బోహైడ్రేట్లు - 18 గ్రాములు,
చక్కెర పదార్థాలు - 15.5 గ్రాములు
కొవ్వు పదార్థాలు - 0.16 గ్రాములు,
ప్రొటీన్లు - 0.72 గ్రాములు
బి1 - 5%, బి2 - 5%
బి3 - 1%, బి6 - 7%
ఫోలేట్ (బి9) - 1%, సి - 18
కాల్షియం - 1%, ఇనుము - 3%
మెగ్నీషియం - 2%, మాంగనీస్ - 4%
ఫాస్ఫరస్ - 3%, పొటాషియం - 4%
జింకు -1%, శక్తి - 70 కాలరీలు
(ద్రాక్షలు పండినవైనా ఎండినవైనా పోషక విలువల్లో తక్కువెక్కువలు , లేవు. రెండూ మంచివే)

మనదేశంలోకి 'కొత్తరకం' ద్రాక్ష పర్షియన్ చొరబాటుదారుల ద్వారా క్రీస్తుశకం సుమారు 1300 సంవత్సరంలో వచ్చినట్టు చెపుతారు. మహ్మద్ బిన్ తుగ్లక్ అప్పట్లో రాజధానిని ఢిల్లీ నుండి దౌలతాబాద్‌కు మార్చే చారిత్రాత్మక ఘట్టంలో భాగంగా ద్రాక్ష దౌలతాబాద్ (మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లాలోని ప్రదేశం) లోకి ప్రవేశించింది. క్రీస్తుశకం 1832 ప్రాంతాల్లో క్రైస్తవ మిషనరీల ద్వారా ద్రాక్ష దక్షిణ భారతదేశంలోకి (సాలెం, మధురై) ప్రవేశించింది. ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో హైదరాబాద్ నిజాం ద్వారా రాష్ట్ర రాజధానిలో వేళ్లూనింది ద్రాక్ష.

అనాబి - షాహి, ఇసాబెల్లా, భోక్రి, ఫ్లేమ్, పర్లెట్, శరద్, థాంసన్ రకాలు ఇక్కడ విరివిగా పండుతాయి.

★ ప్రపంచ వ్యాప్తంగా ఏటా 75 మిలియన్ టన్నుల ద్రాక్ష పండుతుంది.

★ రెండున్నర పౌండ్ల ద్రాక్ష (1.14కిలో)తో ఒక సీసా వైన్ తయారౌతుంది.

★ ఒకసారి చెట్టు నుండి కోసిన తర్వాత ద్రాక్ష మగ్గదు! (మెత్తగా అవుతుంది. కుళ్లుతుంది తప్ప మగ్గదు)

★ ఒక్కో ద్రాక్షగుత్తిలో దాదాపు 75 పళ్లుంటాయి.

★ ప్లాస్టిక్ బ్యాగ్‌లో మూసివుంచితే ద్రాక్షలు ఫ్రిజ్‌లో వారం పాటు నిలువ వుంటాయి.

★ ఫ్రిజ్‌లో బాగా చల్లబరిచిన లేదా గడ్డకట్టిన ద్రాక్ష రుచే వేరు.

ద్రాక్షలు - ఆరోగ్య గుళికలు

▲ ద్రాక్షలో టానిన్‌లు, పాలీఫినాల్‌లూ వుంటాయి. ఆ పదార్థాలు కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో, క్యాన్సర్‌ని ఎదుర్కొనడంలో సహకరిస్తాయి.

▲ రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి.

▲ రక్తం నాళాలలో గడ్డ కట్టడం తగ్గిస్తుంది.

▲ ద్రాక్షల్లో దాదాపు 80 శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపానికి మంచిది.

ద్రాక్ష పేరు ఉచ్చరిస్తుంటేనే నోట్లో రసాలూరుతున్నట్టుంటుంది. ఇక నోట్లో వేసుకుంటే? మంచి కండ పట్టి పంటితో కొరకగానే తియ్యని రసం నాలుకపై పరుచుకుని మధురానుభూతిని ఇస్తుంది. అలా అలా ఎన్ని పళ్ల తిన్నా నోటికి అలుపూ ఉండదూ, కడుపు నిండినట్టూ వుండదు. సరైన రకం ద్రాక్ష, సరిగ్గా పండిన గుత్తి దొరకాలే కానీ, ఏ కాలమైనా ఎంత కాలమైనా తినేస్తూ గడిపేయమూ!

★

సుందర తెలుగు భాషా వన విహారం

తెలుగు భాష తెలిసిన వారందరికీ "బాల వ్యాకరణం" పేరు తెలిసే వుంటుంది. ఆ బాల వ్యాకరణానికి సాహితీ సౌరభాన్ని అద్దిన సౌందర్య భావకులు దువ్వూరి. కటువైన (భాషా) శాస్త్రాన్ని అతి సుకుమారమైన 'పుష్పం'గా మలచడం వీరు సాధించిన విద్య. అలాగే సంక్లిష్టమైన మానవ జీవితాన్ని సరళతరం చేసుకొన్న సాధనాపరులు. ఈ సాధనలో వీరు చేతబూనిన జీవన సూత్రాలు - స్నేహ ధర్మమూ, సౌందర్య భావనా అని వీరి జీవిత చరిత్ర మనకు చెప్తోంది. ఈ గ్రంథంలో జీవితాన్ని ఎంత సౌందర్యవంతంగా మలుచుకోవచ్చో తెలుస్తుంది.

గ్రాంథిక భాషానురక్తి (భక్తి) కలిగిన శాస్త్రిగారు తమ స్వీయ చరిత్రను వ్యవహార భాషలో రాయడం అభినందించాల్సిన అంశం...

భాషా శాస్త్రవేత్తలు, రచయితలు... ప్రచురణకర్తలు, ప్రభుత్వ విద్యాశాఖ తీరు తెన్నులు... నాటికాలంలో... కవులకు, పబ్లిషర్లకు మధ్య గల సంబంధాలు, కవి, పండితుల యొక్క భాషా, సాహిత్య, విద్యా, పాండిత్యంలో గల వైరుధ్యాలు, నాటి కాలం ఆప్యాయతలు.. ఆలోచనలు, గురు-శిష్య వాత్సల్యంతో కూడిన సత్ సంబంధాలు, సింహావలోకనంగా సమీక్షించినట్లుగా "శాస్త్రి"గారి జీవిత చరిత్ర చక్కగా రాశారు.

కళా ప్రపూర్ణ "దువ్వూరి వేంకట రమణ శాస్త్రి స్వీయచరిత్ర"
పేజీలు : 240, వెల : 150/-,
ప్రతులకు : అభినవ ప్రచురణలు
6-1-70, వరదరాజ నగర్, తిరుపతి.
ఫోన్: 0877-2230135.
మరియు విశాలాంధ్ర, నవోదయ బ్రాంచీలు.

వ్యాకరణ గ్రంథ రచనలు "కలభాషిణీ" మధుర లాలసల గ్రంథ రచనలు... అవి విద్యార్థులకు వాచకములుగా పెట్టిన తీరు... పండితులతో శాస్త్రిగారి వాదనలు... ఆంధ్రా విశ్వ విద్యాలయంలో సెనెట్ సభ్యత్వం... లాంటి ఎన్నో అంశాలు.. ఈ గ్రంథంలో ముఖ్యంగా తెలుగు బాషా, వ్యాకరణాంశాలపై అభిమానం గల వారందరినీ ప్రతి పుట పలకరిస్తుంది. 1974వ సంవత్సరం దాకా అనేక విద్యా విషయక అంశాలు ఈ 240 పేజీల గ్రంథంలో లభిస్తాయి.

అచ్చుతెలుగు జీవితాలను, తెలుగు చదువుల్నీ, తెలుగు గురువుల్నీ, తెలుగు శిష్యుల్నీ, తెలుగు స్నేహాల్నీ కలవరించి పలవరించారు ఈ పుస్తకంలో శాస్త్రిగారు. సుందర తెలుగు భాషా వనంలో విహారం చేసిన అనుభూతి పాఠకులకు కలుగుతుంది.

- తంగిరాల చక్రవర్తి

కొత్త పుస్తకాలు

ఏ స్వేచ్ఛా "వెలుగుల(కీ) తీరం!?"

దాదాపు 130 సంవత్సరాల చరిత్ర కల్గిన తెలుగు నవల. ఎంతో వికాశవంతంగా ప్రకాశించి పాఠకుల్లో, ప్రజల్లో చైతన్యం కలిగించింది. నవలా ప్రక్రియ ఆంగ్ల భాషా ప్రభావంతో మన తెలుగు నాట ఆరంభమైందనే కొందరు పండితులు విశ్లేషిస్తున్నారు. ఆంగ్లంలో "నావల్" అని, కన్నడంలో "కాదంబరి" అని, హిందీలో "ఉపన్యాస్" అని నవలను నిర్వచిస్తున్నారు. లార్డ్ మేయో అనే గవర్నర్ జనరల్ ప్రకటన మేరకు తెలుగులో రాసిన మొదటి నవల "శ్రీరంగరాజ చరిత్ర" (1872). ఆ నవలా రచయిత నరహరి శెట్టి గోపాల కృష్ణమ్మ చెట్టి - కానీ తొలి నవలా తేజంగా తెలుగు వారు కందుకూరి వీరేశలింగం పంతులు రాసిన "రాజశేఖర చరిత్ర"గా ప్రమాణీకరిస్తారు. విస్తృత కథాంశంతో కూడిన ఈ ప్రక్రియను 'నవల' అని నామకరణం చేసిన వారు "కాశీభట్టు బ్రహ్మయ్యశాస్త్రి... శృంగారం/ హాస్యం/ కరుణ/ రౌద్రం/ వీరం/ భయానకం / భీభత్సం/ అద్భుతం/ శాంతం/ అనే నవరసాలతో నిండిన రచనే "నవల"గా పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. పౌరాణికాంశాల నుండి ప్రపంచీకరణ పీడనం దాకా 'నవల' వో వినూత్న ప్రక్రియగా తెలుగు నాట ప్రాచుర్యం పొందుతుంది. గోర్కీ "అమ్మ" నవల శత వసంతాల సంబరాలు చేసుకుందీ తెలుగు నేలలో గత సంవత్సరం. మన ప్రాచీన నవలా కారులు.. అష్టాదశ వర్ణనలు "నవలా" సాహిత్యంలో తప్పని సరిగా ఉండాలన్నారు. అవి 1.నగరం, 2. సముద్రం, 3.శైలం, 4.ఋతువు, 5.చంద్రోదయం, 6.సూర్యోదయం, 7.ఉద్యానం, 8. జలక్రీడ, 9.మధుపానం, 10.రథోత్సవం, 11.విపులంబం, 12.వివాహం, 13.కుమారోదయం, 14.మంత్రం, 15.ద్యూతం, 16.ప్రయాణం, 17.యుద్ధం, 18.నాయకాభ్యుదయం ఉండాలి(ట)? ఆదశగా 'నవల...' అధ్యయనం చేయాలి(ట)??



వెలుగుల తీరం
రచన : సింహప్రసాద్
పేజీలు : 224,
వెల : 60/-,
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

సింహ ప్రసాద్ రాసిన 'వెలుగుల తీరం' స్త్రీ వాదంతో ఫెమినిజానికి దగ్గరగా "మేఘన" పాత్రను సృష్టించారు రచయిత... ఒక నటిగా, కవయిత్రిగా, మేఘన పాత్ర బాగానే మలిచారు. ఫ్రీ సెక్స్‌తో ప్రారంభమై విశ్వ మాతృత్వంతో ముగిసిన ఓ యువతి జీవతం, జీవన యానం 224 పేజీల్లో చూపారు. సమాజం స్త్రీని అన్ని విధాలా అణచి వేయడం.. వాణిజ్య వస్తువుగా మార్చే సంస్కృతిని ఇంకా బలంగా (కథాపరంగా) చూపినా ఈ నవల బాగుండేది. సమభాగం, సమభావం గల వ్యక్తితో 'మేఘన' కలిసి నడిస్తే కథ ముగింపు అర్థవంతంగా ప్రయోజనకరంగా వుండేది. మగాళ్ల ద్వంద్వ ప్రవృత్తిని, సమాజపు హిపోక్రసీని హేళన చేస్తూ మలిచిన సన్నివేశాలు ఇంకా బలంగా రూపొందిస్తే నవల మరింత సాహితీ పరిపుష్టి సంతరించుకునేది. వివాహ వ్యవస్థనే వ్యతిరేకిస్తే సమాజం మరింత సంక్షోభంలోకి వెళ్లదా?!

- తంగిరాల చక్రవర్తి



లావాటి మల్లుడు



మీరు ఎంతోమంది మల్లయోధులను చూసి వుంటారు (ఫొటోల్లోనే). అలాగైనాసరే ఈ రేంజ్ వాళ్లని చూసి వుండరు! అవునా?! ఇతగాడికి ప్రపంచంలోనే లావాటి మల్లయోధుడిగా గుర్తింపు వుంది సుమా! అదే సుమోగా! ఇంతకీ మొద్దు మల్లయోధుడి పేరు ఏంటంటే...యార్ బాగ్. బరువు ఎంతనుకున్నారు? ఆ ఎంత? సింపుల్‌గా 400 కేజీలు...ఆ పైన! తమాషా ఏంటంటే... ఈయనగారికి ముందు ప్రపంచంలోకెల్లా లావాటి మల్లయోధుడిగా పేరుగాంచిన వ్యక్తి బరువు ఎంతనుకున్నారు? 499 కేజీలే. ఆయనగారు చనిపోయాకే ఈయనకు ఆ ఖ్యాతి దక్కిందిలెండి!

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్ కలంస్నేహం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు: ఎస్. అశోక్ కుమార్
చదువు: 8వ తరగతి
వయస్సు: 13 సం॥
స్కూలు: విజ్ఞాన మందిర్ విద్యాలయం
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: టీవీ చూడడం, షటిల్ ఆడడం
చిరునామా: ఎస్. అశోక్ కుమార్
సన్నాఫ్ ఎస్.రమేష్ కుమార్, కర్నూల్.

పేరు: బి. కోటేశ్వరరావు
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: శ్రీ సాయి రాఘవేంద్ర విద్యానికేతన్
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం
చిరునామా: బి. కోటేశ్వరరావు
సన్నాఫ్ వెంకటేశ్వర్లు, ఇం.నెం.10-4-25,
మామిళ్ల గూడెం, ఖమ్మం.

పేరు: పి. వంశీకృష్ణ
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూల్: జడ్.పి.ఎస్.ఎస్
లక్ష్యం : ఇంజనీర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం
చిరునామా: పి. వంశీకృష్ణ
సన్నాఫ్ నాగేశ్వరరావు,
రామన్నపేట, ఖమ్మం.

పేరు: సి.హెచ్. హరీష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: సిద్ధార్థ హైస్కూల్
హాబీలు: చదవటం,డ్రాయింగ్, ఆడటం, పాడటం
చిరునామా: సి.హెచ్. హరీష్
ఇం.నెం.3-121, ధర్పల్లి,
నిజామాబాద్.

పేరు: పి. దుర్గా ప్రసాద్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.ఎస్ స్కూల్
లక్ష్యం : టీచర్ కావడం
హాబీలు: చదవటం, వార్తలు సేకరించడం
చిరునామా: పి. దుర్గా ప్రసాద్
సన్నాఫ్ పి. మోహన్‌రావు,
రేపల్లె, గుంటూరు.

పేరు: ఎన్. వెంకటేష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు : జడ్.పి.పి.ఎస్
లక్ష్యం: క్రికెటర్ కావడం
హాబీలు: చదవటం, క్రికెట్ ఆడడం
చిరునామా: ఎన్. వెంకటేష్
సన్నాఫ్ ఎన్. చిరంజీవి,
రేపల్లె, గుంటూరు.

పేరు: డి.గోపి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు : జడ్.పి.పి.ఎస్
లక్ష్యం: మిలట్రీలో చేరడం
హాబీలు: కథలు చదవటం
చిరునామా: డి.గోపి
అడవుల దీవి (గ్రామం),
నిజాంపట్నం, గుంటూరు.